నేటి కందం- నేటికి అందం



"కామను వెల్తు"కు పలు శుభ
కామన లందించి? జగతి గర్వించు గతిన్
టీముల మధ్యన " క్రీడలు"
ప్రేమగ నాడించ ప్రభుత పేర్కొనెను మొగిన్ !!
(కామన్ వెల్త్ గేమ్స్ భారతదేశంలో జరపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

అగ్రదేశ టారీఫ్ ల
ఆగబోని ఈ యుద్ధం
ఎదుర్కోను మనదేశం
ఎంతవరకు సంసిద్ధం
ఉత్పత్తుల ఎగుమతిపై
ఉవ్వెత్తున దాడి మిన్న
పడిపోయినా జీడీపీ
ప్రభుత్వం చర్య సున్న

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 30-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:24 పేజీలు:6 వెల: రూ.1/-


## ప్రపంచం మొత్తం భారత్‌పైనే ఆశలు పెట్టుకుంది..

### -టోక్యో సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 29: భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అని, త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని జపాన్ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టోక్యో లో ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరం లో పాల్గొని ప్రసంగించారు. ప్రపంచం అంతా భారత్‌పైనే ఆశలు పెట్టుకుందని, విదేశీ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం పెరిగిందని అన్నారు. పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా రెట్టింపు అవుతున్నాయని చెప్పారు.

ఈ సందర్భంగా భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు. భారత్ అభివృద్ధిలో జపాన్ కీలక భాగస్వామి అని అన్నారు. 'ప్రపంచం కేవలం భారతదేశాన్ని మాత్రమే చూడటం లేదు.

భారత్‌పై ఆశలు పెట్టుకుంది. భారత అభివృద్ధి ప్రయాణంలో జపాన్ కీలక పాత్ర పోషించింది. మెట్రో రైళ్ల నుంచి సెమీకండక్టర్లు, స్టార్టప్‌లు.. ఇలా అనేక రంగాల్లో తోడ్పాటు అందించింది. జపాన్ సంస్థలు భారత్‌లో 40 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి' అని ప్రధాని చెప్పుకొచ్చారు. భారత్‌లో ఆర్థిక, రాజకీయ స్థిరత్వం నెలకొందని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు.

భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అని, త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని వివరించారు. ప్రభుత్వ పరంగా పారదర్శకమైన విధానాలను అవలంభిస్తున్నట్లు చెప్పారు. భారత్ మార్కెట్లు భారీ రాబడిని అందిస్తున్నాయని, తమకు బలమైన బ్యాంకింగ్ రంగం, 700 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయని వివరించారు. అణుశక్తి, గ్రీన్ ఎనర్జీ, ఆటోసెక్టార్‌లో రెండు దేశాలు మరింత కలిసికట్టుగా పనిచేయాలని మోదీ సూచించారు.

## భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

భద్రాద్రి కొత్తగూడెం , ఆగషు 29: ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద పోటెత్తింది. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39.9 అడుగులకు చేరింది. రాత్రి వరకు గోదావరి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది.

గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో.. భద్రాచలం వాసులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నది వైపునకు ఎవరూ వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

## ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ ఓ సువర్ణాధ్యాయం : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ, ఆగష్టు 29:ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో ఆపరేషన్ సిందూర్ ఓ సువర్ణాధ్యాయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. స్వదేశీ ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ-రిపోర్టింగ్ వ్యవస్థను నిర్మించడంలో ప్రభుత్వ రంగ సంస్థల సహకారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. భారత్-పాకిస్తాన్ మధ్య సైనిక వివాదంలో ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థ కీలకపాత్ర పోషించింది. స్కోప్ ఎమినెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర గురించి మాట్లాడారు. ఆదాయం, లాభం వంటి కీలకమైన ఆర్థిక పారామితులలో ప్రభుత్వ రంగ సంస్థలు బాగా పనిచేశాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో మూడింట ఒక వంతు లాభాలను ఆర్జిస్తున్నాయని, గత దశాబ్దంలో ప్రభుత్వ రంగ సంస్థల నికర లాభం గణనీయంగా పెరిగిందన్నారు.

ప్రభుత్వ రంగ పరిశ్రమలు సుపరిపాలన, పారదర్శకత రంగంలో ప్రమాణాలను నిర్దేశించాయని ముర్ము తెలిపారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ప్రాముఖ్యతపై స్పందిస్తూ.. స్వయం సమృద్ధ భారతదేశాన్ని నిర్మించడంలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశ రక్షణ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాద శిబిరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని.. భారతదేశంపై దాడి చేసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. స్వదేశీ ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థ తన సామర్థ్యాన్ని ప్రదర్శించిందన్నారు. ఈ వ్యవస్థ సృష్టికి ప్రభుత్వ రంగ సంస్థలు దోహదం చేశాయని.. ఇది వారికి చాలా గర్వకారణంగా నిలుస్తుందన్నారు. ఆవిష్కరణలు, పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యం ద్వారా జాతీయ భద్రతలో స్వావలంబన సాధించడంలో పీఎస్‌యూలు ప్రధాన పాత్ర పోషించాయని రాష్ట్రపతి నొక్కి చెప్పారు. వ్యవసాయం, మైనింగ్, అన్వేషణ, తయారీ, ప్రాసెసింగ్, సేవలు వంటి అనేక రంగాల్లో పీఎస్‌యూలు కీలక పాత్ర పోషించాయని.. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి ప్రభుత్వ జాతీయ ప్రాధాన్యతల్లో ఒకటని రాష్ట్రపతి పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 2 వరకు తెలంగాణలో వానలు

### - వెల్లడించిన వాతావరణ కేంద్రం

హైదరాబాద్, ఆగష్టు 29: తెలంగాణలో సెప్టెంబర్ 2 వరకు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. శనివారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.

ఆదివారం రోజున ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. హైదరాబాద్, జనగాం, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్, నారాయణపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ బలమైన ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయని పేర్కొంది. సెప్టెంబర్ ఒకటిన ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్, ములుగు, వరంగల్, జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని తెలిపింది.

సెప్టెంబర్ 2న ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ములుగు, నాగర్ కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, భువనగిరి జిల్లాల్లో వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా కామారెడ్డి జిల్లాల్లో గాంధారి మండల కేంద్రంలో 27.4, సర్వాపూర్‌లో సెంటీమీటర్ల భారీ వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

## ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు దగ్దం.. ప్రయాణికులు క్షేమం

విశాఖపట్నం ఆగస్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: విశాఖపట్నంలో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు దగ్ధమైంది. కూర్మన్నపాలెం నుంచి విజయనగరానికి బస్సు వెళ్తున్నది. ఈ క్రమంలో విశాఖలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న శాంతిపురం వద్దకు రాగానే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పొగలను గమనించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేశారు. ప్రయాణికులందర్నీ దించేశారు. క్రమంగా మంటలు వ్యాపించడంతో అంతా చూస్తుండగానే బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే పక్కనే పెట్రోల్ బంక్ ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అయితే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు తెలుస్తున్నది. కాగా, ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి ప్రాణహాని జరుగలేదని ఆర్టీసీ ఆర్ఎం అప్పలనా యుడు వెల్లడించారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని తెలిపారు.

## నేటి నుండి ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాలు

### -నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పీకర్ సమావేశం

హైదరాబాద్ ఆగష్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );););: రేపటి నుండి ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపధ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జీఏడీ సెక్రటరీ రఘునందన్ రావు, అడిషనల్ సెక్రటరీ (ఫైనాన్స్)- రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్)- శివలింగయ్య హాజరయ్యారు. హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, ఏడీజీ, లాఢ ఆర్డర్ మహేష్ భగవత్, అడిషనల్ సీపీ (లా ఢ ఆర్డర్)- విక్రమ్ సింగ్ మాన్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్ కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. రేపటి నుండి తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు. గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలి. గౌరవ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలి. శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలి. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలి. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం జరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే భారీ వర్షాలు కురిసి కొన్ని రూట్లలో రోడ్లు దెబ్బతిన్నాయి. ట్రాఫిక్ అధికారులు సమన్వయం చేసుకుని గౌరవ సభ్యులు సరైన సమయానికి సభకు చేరుకునే విధంగా సహకరించాలి. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలి, తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయని స్పీకర్ పేర్కొన్నారు. కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలి. అవసరమైన నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలి. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలి. తెలంగాణ పోలీసు దేశంలోనే సమర్థవంతమైనది, మంచి పేరు ఉన్నది. మీ ఆధ్వర్యంలో శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగే విధంగా సహకరించాలి అని సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు మాట్లా డుతూ సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తాం. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అవసరమైన అధికారులను అందుబాటులో ఉంచుతాం. సభా నిర్వాహణకు ఇబ్బందులు లేకుండా, సజావుగా జరిగే విధంగా ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సహకరిస్తాం అని ఆయన స్పష్టం చేశారు.

## భారీ విధ్వంసానికి దారి తీసిన నిరసన ర్యాలీ

### -పార్టీ జెండాలతో ఒకర్ని ఒకరు కొట్టుకున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు



పాట్నా ఆగష్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. పార్టీ జెండాలతో బీహార్ లోని పాట్నాలో ఒకర్ని ఒకరు కొట్టుకున్నారు. నిరసన ర్యాలీ భారీ విధ్వంసానికి దారి తీసింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ఓట్ అధికార్ యాత్ర నిర్వహించారు. ఆ ర్యాలీలో ఓ వ్యక్తి ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీనికి నిరసన ఇవాళ బీజేపీ ర్యాలీ చేపట్టింది. అయితే ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు కూడా ర్యాలీ నిర్వహించారు. ఆ రెండు పార్టీలకు చెందిన నేతలు ఎదురుపడిన సమయంలో.. ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది .భారీ సంఖ్యలో కార్యకర్తలు పార్టీ జెండాలు ఉన్న కర్రలతో దాడి చేసుకున్నారు. ఓ దశలో కాంగ్రెస్ కార్యాలయం వద్ద కూడా దాడి జరిగింది. కాంగ్రెస్‌కు గట్టి బదులిస్తామని బీజేపీ నేత నితిన్ నాబిన్ అన్నారు. తల్లిని దూషించిన కాంగ్రెస్ పార్టీకి బీహారీలు గుణపాఠం చెబుతారని అన్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన అన్నారు. నితీశ్ కుమార్ పాలన సరిగా లేదని, ఇదంతా ప్రభుత్వ జోక్యంతోనే జరుగుతోందని కాంగ్రెస్ నేత డాక్టర్ ఆశుతోష్ ఆరోపించారు. దర్భంగా జిల్లాలో జరిగిన ర్యాలీలో రఫీక్ అలియాస్ రాజా అనే వ్యక్తి అకస్మాత్తుగా మైక్‌ను అందుకుని ప్రధాని మోదీతో పాటు ఆయన తల్లిపై దుర్భాషలాడాడు. రఫీక్ అలియాస్‌ను భోపురా గ్రామస్థుడిగా గుర్తించారు. సిమ్రి పోలీసు స్టేషన్‌లో అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బితౌలీ వద్ద ర్యాలీ జరుగుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. చాలా తీవ్రమైన పదజాలంతో మోదీ, ఆయన తల్లిని తిట్టాడు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి అనుకూలంగా ఆ వ్యక్తి నినాదాలు చేశాడు. ప్రధాని మోదీపై దుర్భాషలాడిన వ్యక్తి రఫీక్ ను పోలీసులు అరెస్టు చేశారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ.. నార్సింగి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మూసివేత

### -ఉస్మాన్‌సాగర్ 8 గేట్లు ఎత్తిన జలమండలి అధికారులు

హైదరాబాద్ ఆగష్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ.. నార్సింగి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మూసివేత ఎగువ నుంచి జంట జలాశయాలకు భారీగా వరద వస్తున్నది.ఎగువ నుంచి జంట జలాశయాలకు భారీగా వరద వస్తున్నది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు పూర్తిస్థాయిలో నిండటంతో జలమండలి అధికారులు ఉస్మాన్‌సాగర్ 8 గేట్లు ఎత్తారు. మూసీ నదిలో వరద ఉధృతి పెరగడంతో మంచిరేవుల బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తున్నది. అప్రమత్తమైన అధికారులు నార్సింగి వద్ద ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును మూసివేశారు. సర్వీస్ రోడ్డు ఎంట్రీ, ఎగ్జిట్‌ను మూసివేడంతో మంచిరేవుల -నార్సింగి మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని అధికారులు సూచించారు. ఉస్మాన్‌సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో ఎనిమిది గేట్లు ఎత్తి 4,096 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులు. ప్రస్తుతం 1789.45 అడుగుల వద్ద ఉన్నది. అదేవిధంగా హిమాయత్‌సాగర్ జలాశయానికి 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 3 గేట్లు ఎత్తి 2,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1763.50 అడుగులు. కాగా, ప్రస్తుతం 1762 అడుగులు నీటిమట్టం ఉన్నది.

### ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే..

## ఎన్డీయేకు 324.. ఇండియా కూటమికి 208 సీట్లు

### ఇండియా టుడే-సీ వోటర్ 'మూడ్ ఆఫ్ ద నేషన్' సర్వే నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ ఆగష్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దేశంలో మరోసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే)కూటమి అధికారంలోకి రానుందా.. 12 ఏండ్లుగా అధికారం కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ పార్టీకి మరోసారి భంగపాటు తప్పదా?. రాహుల్ గాంధీ మరో ఐదేండ్లపాటు విపక్షంలోనే కొనసాగాలా?. అంటే అవుననే అంటున్నది ఇండియా టుడే-సీ వోటర్ 'మూడ్ ఆఫ్ ద నేషన్' సర్వే నివేదిక.

దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 324 సీట్లు లభిస్తాయని సర్వేలో తేలింది. విపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి 208 స్థానాలు మాత్రమే దక్కే అవకాశం ఉందని స్పష్టమైంది. ఈ ఏడాది జూలై 1 నుంచి ఆగస్టు 14 దాకా ఈ సర్వేను నిర్వహించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ లోక్‌సభ నియోజకవర్గాల్లో 54,788 మందిని ప్రశ్నించారు. సీవోటర్ రెగ్యులర్ ట్రాకర్ డేటా ద్వారా మరో 1,52,038 మంది అభిప్రాయాలు సేకరించారు. మొత్తంగా 2,06,826 మంది అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సర్వే నివేదికను రూపొందించారు. దీనిద్వారా లోక్‌సభకు ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయే మళ్లీ ఘన విజయం సాధించడం తథ్యమని వెల్లడైంది. పార్టీల పరంగా చూస్తే బీజేపీకి సొంతంగా 260 సీట్లు, కాంగ్రెస్‌కు 97 సీట్లు రానున్నాయి. 2024 ఎన్నికల్లో ఎన్డీయేకు 44 శాతం ఓట్లు లభించగా, ఇప్పుడు 46.7 శాతం ఓట్లు, ఇండియా కూటమికి 40.9 శాతం ఓట్లు లభిస్తాయని సర్వే పేర్కొంది. ఇండియా టుడే-సీ వోటర్ 'మూడ్ ఆఫ్ ద నేషన్' సర్వే..అయితే గత ఫిబ్రవరిలో నిర్వహించిన సర్వేలో బీజేపీకి 281 సీట్లు వస్తాయని తేలింది. తాజాగా ఆ సంఖ్య 21 స్థానాలు కోల్పోయి 260కి పడిపోయింది. అదేవిధంగా ఎన్డీయే కూటమికి 343 రాగా, అది 324కు తగ్గింది. ఇక కాంగ్రెస్ పార్టీ 78 స్థానాల్లో గెలుస్తుందని ఫిబ్రవరిలో తేలగా, ఇప్పుడు ఆ సంఖ్య 97కు పెరిగింది. ఇది 2024 ఎన్నికల్లో కంటే 2 స్థానాలు తక్కువ కావడం గమనార్హం. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 543 స్థానాలకుగాను బీజేపీకి 240 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో మెజార్టీ మార్కుకు మరో32 సీట్లు దూరంలో నిలిచిపోయింది. దీంతో మిత్రపక్షాల సహాయంతో కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మొత్తంగా ఎన్డీయేకు ప్రస్తుతం 293 సీట్లున్నాయి. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండీ కూటమి 234 సీట్లు సాధించింది. విపక్షాలన్నీ ఒక్కటై పోటీచేసినప్పటికీ హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలయ్యాయి.

## ఖానాపూర్‌లో ట్రాఫిక్ కష్టాలు.. భారీ వాహనాల మళ్లింపుతో అవస్థలు

హైదరాబాద్, ఆగష్టు 29:ఖానాపూర్ మున్సిపాలిటీలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది . పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలోని ఖానాపూర్ జాతీయ రహదారిపై భారీ వాహనాల రద్దీ ఉండటంతో గంటల తరబడి వాహనాలు రోడ్లపై నిలిచాయి. దీంతో ప్రజలు, వ్యాపారస్థులు ఇబ్బందులకు గురయ్యారు.

భారీ వర్షాల కారణంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు నిర్మల్ -హైదరాబాద్ రోడ్డు నిలిపివేసి వాహనాలను ఖానాపూర్ మీదుగా జగిత్యాల, కరీంనగర్, హైదరాబాద్‌కు మళ్లించారు. దీంతో ఖానాపూర్ పట్టణంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. మహారాష్ట్ర, రాజస్థాన్, పంజాబ్,మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చే భారీ కంటైనర్లు సరైన మార్గం తెలియకపోవడంతో పట్టణంలోని పలు కాలనీ గుండా వెళ్లాయి. రహదారి పొడవున వాహనాలు నిలవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది.

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన చౌరస్తాలో సిగ్నల్ ఏర్పాటుతోపాటు కనీసం హోంగార్డునైనా నియమించలేదని వాహనాదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఐదుగురు సభ్యులతో మానిటరింగ్ కమిటీ

హైదరాబాద్ ఆగష్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు నేడు ఐదుగురు సభ్యులతో కూడిన మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. బిజెపి శాసనసభ పక్ష ఉప నాయకులు పాయల్ శంకర్, పార్లమెంట్ సభ్యులు ఎం రఘునందన్ రావు, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు పార్లమెంట్ సభ్యులు గరికపాటి మోహన్ రావు, మాజీ శాసనసభ్యులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జకార్యదర్శి అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు తదితరులతో కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.

## విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి కొత్త డీజీ

హైదరాబాద్, ఆగష్టు 29: తెలంగాణ విజిలెన్స్ ఢ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి కొత్త డైరెక్టర్ జనరల్‌గా విక్రమ్ సింగ్ మాన్ ఐపీఎస్ (1998 బ్యాచ్) నియమితులయ్యారు. ఈ నెల 31న పదవీ విరమణ పొందుతున్న కే.శ్రీనివాస రెడ్డి ఐపీఎస్ (1994 బ్యాచ్) స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రస్తుతం హైదరాబాద్ నగర అదనపు పోలీస్ కమిషనర్ (లా ఢ ఆర్డర్)గా పనిచేస్తున్న విక్రమ్ సింగ్ మాన్, ఇకపై విజిలెన్స్ ఢ ఎన్‌ఫోర్స్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు డీజీగా నాయకత్వం వహించనున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.



# చిన్న పరిశ్రమలతో పెద్ద ఎత్తున ప్రయోజనాలు

## (30 ఆగస్టు "జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవం" సందర్భంగా)

అన్ని వర్గాల, ముఖ్యంగా పేద వర్గాల ప్రజలకు గౌరవప్రద పని కల్పించి , నిరుద్యోగ సమస్యకు కొంత పరిష్కారం చూపి, దేశ ఆర్థికాభివృద్ధికి ఊతం ఇవ్వడానికి తిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వాలు చొరవ తీసుకోవడం కొనసాగుతున్నది. పేద యువతకు వరంగా మారిన చిన్నతరహా పరిశ్రమల్లో ముఖ్యమైనవిగా క్యాండిల్ తయారి, వ్యవసాయ సంబంధ ఉత్పత్తులు, వస్త్రాలు-రెడీ మేడ్ దుస్తువుల తయారీ, హస్తకళా ఉత్పత్తులు, బొమ్మల తయారి, మసాలా దినుసుల తయారీ, అగర్‌బత్తీల తయారీ, పేపర్ ప్లేట్స్, పచ్చళ్ల తయారీ, నగల తయారీ, లెదర్ ఉత్పత్తులు, సౌందర్య ఉత్పత్తుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, గృహాల్లో వాడుకునే రసాయనాలు లాంటి ఉత్పత్తులు వస్తాయి.

జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవం:

భారత కేంద్ర ప్రభుత్వ చిన్న తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ 20 ఆగస్టు 2000 రోజున చిన్న తరహా పరిశ్రమలను పెద్ద మొత్తంలో నెలకొల్పడానికి, ప్రణాళికలు ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ నిర్ణయానికి గుర్తుగా ప్రతి ఏట 30 ఆగస్టు రోజున "జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవం (నేషనల్ స్మాల్-స్కేల్ ఇండస్ట్రీ డే)" పాటించడానికి నిర్ణయం తీసుకున్నారు. చిన్న తరహా పరిశ్రమల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, అవసర నైపుణ్యాలను పెంపొందించడం, ఆర్థిక చేయూతను ఇవ్వడం, మహిళాశక్తిని బలోపేతం చేయడం, ఉద్యోగ ఉపాధులను కల్పించడం, దేశ ఆర్థిక ప్రగతికి బాటలు వేయడం లాంటి అంశాలను ప్రచారం చేయడానికి ఈ దినోత్సవ వేదికలు ఉపయోగపడతాయి.

జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవ ఉద్దేశ్యం:

జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవాన్ని 30 ఆగస్టు 2001 నుంచి ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతోంది. దేశ సమగ్రాభివృద్ధికి చిన్న తరహా పరిశ్రమలు ఎంతగానో దోహదపడుతున్నాయి. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేస్తూ, కుటుంబాలకు శ్రేయస్సు కల్పించడంతో పాటు సమ్మిళిత అభివృద్ధి దిశగా అడుగులు వేయడం జరుగుతోంది. పేద ప్రజలను లేదా యువతను ఎంపిక చేసుకొని వారితో ఔత్సాహిక వేత్తలుగా ప్రోత్సహించడం, ఉద్యోగాల కల్పన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం, సమ్మిళిత అభివృద్ధికి దోహదపడడం, ఔత్సాహిక వ్యాపారవేత్తలను శక్తివంతం చేయడం, స్థానిక హస్తకళలను ప్రోత్సహించడం, భారత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడం లాంటి లక్ష్యాలతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఖ్యాతి గడించిన వ్యాపారవేత్తలను గుర్తించడం, లోపాలను లేదా అవరోధాలను గుర్తించడం, చిన్న పరిశ్రమల శక్తిని వివరించడం లాంటి అంశాలను కూడా ఈ వేదికను ఉపయోగించుకుంటారు.

జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినం వేదికగా నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించి, ఆర్థిక సహాయం అందించి, అవసర నైపుణ్యాలను నేర్పించి, పట్టణ గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టించడం విధిగా జరగాలి. చిన్న పరిశ్రమలతో పెద్ద మార్పులను తీసుకురావాలి. ఊరూ, వాడ, పల్లె, పట్నాలు చిన్న తరహా పరిశ్రమలతో కళకళలాడాలని కోరుకుందాం.

-డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# బీహార్లోని రాజ్‌గిర్‌లో జాతీయ క్రీడా దినోత్సవం నాడు పురుషుల హాకీ ఆసియా కప్ 2025 సందర్భంగా ప్రధాని శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, ఆగష్టు 29:బీహార్లోని చారిత్రక నగరం రాజ్‌గిర్‌లో జాతీయ క్రీడా దినోత్సవమైన ఆగస్టు 29న ప్రారంభమయ్యే పురుషుల హాకీ ఆసియా కప్ 2025లో ఆసియా వ్యాప్తంగా పాల్గొనే జట్లు, క్రీడాకారులు, అధికారులు, వారి అభిమానులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2025, ఆసియా రగ్బీ యూ20 సెవెన్స్ ఛాంపియన్‌షిప్ 2025, ఐఎస్‌టీఏఎఫ్ సెపక్‌తక్రా ప్రపంచ కప్ 2024, మహిళ ఏషియన్ ఛాంపియన్స్ ట్రోఫీ 2024 లాంటి కీలకమైన టోర్నమెంట్లను నిర్వహించడం ద్వారా ఇటీవలి కాలంలో శక్తిమంతమైన క్రీడాకేంద్రంగా తనదైన ముద్ర వేసిన బీహార్‌ను అభినందించారు.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేసిన థ్రెడ్‌లో ప్రధాని ఇలా అన్నారు:

"రేపు, ఆగస్టు 29న (ఆ రోజు జాతీయ క్రీడా దినోత్సవం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి కూడా) పురుషుల హాకీ ఆసియా కప్ 2025 బీహార్లోని చారిత్రక నగరం రాజ్‌గిర్లో ప్రారంభమవుతుంది. ఆసియా వ్యాప్తంగా ఈ పోటీల్లో పాల్గొంటున్న జట్లు, క్రీడాకారులు, అధికారులు, వారి అభిమానులకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా."

"భారత్, ఆసియా వ్యాప్తంగా మిలియన్ల మంది హృదయాల్లో హాకీకి ప్రత్యేక స్థానం ఉంది. భవిష్యత్తు తరాలకు చెందిన క్రీడా ప్రేమికులకు ఉత్కంఠభరితమైన మ్యాచులు, అత్యుత్తమ ప్రతిభా ప్రదర్శనలు, గుర్తుండిపోయే క్షణాలు ఈ టోర్నమెంట్లో ఉంటాయని నేను విశ్వసిస్తున్నాను."

"పురుషుల హాకీ ఆసియా కప్ 2025కు బీహార్ ఆతిథ్యమివ్వడం సంతోషించదగ్గ విషయం. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2025, ఆసియా రగ్బీ యూ20 సెవెన్స్ ఛాంపియన్‌షిప్ 2025, ఐఎస్‌టీఏఎఫ్ సెపక్‌తక్రా ప్రపంచ కప్ 2024, మహిళ ఏషియన్ ఛాంపియన్స్ ట్రోఫీ 2024 లాంటి కీలకమైన టోర్నమెంట్లకు ఆతిథ్యమివ్వడం ద్వారా బీహార్ శక్తిమంతమైన క్రీడా కేంద్రంగా మారింది. ఈ నిరంతరం వేగం.. బీహార్లో పెరుగుతున్న మౌలిక వసతులు, క్షేత్ర స్థాయిలో ఉత్సాహం, వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభను ప్రోత్సహించడంలో చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తోంది."

# జపాన్, చైనా పర్యటనకు బయలుదేరి వెళ్లే ముందు ప్రధాని ప్రకటన

న్యూఢిల్లీ, ఆగష్టు 29:జపాన్ ప్రధానమంత్రి షిగేరు ఇషిబా ఆహ్వానం మేరకు, 15 వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆ దేశానికి వెళుతున్నాను.

నా పర్యటనలో భాగంగా, గత పదకొండేళ్లలో స్థిరమైన, గణనీయమైన పురోగతి సాధించిన మన ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యానికి తర్వాతి దశను రూపొందించడంపై మేం దృష్టి సారిస్తాం. మన సహకారానికి కొత్త రెక్కలు ఇవ్వడానికి, మన ఆర్థిక, పెట్టుబడుల సంబంధాల పరిధిని, ఆశయాన్ని విస్తరించడానికి, ఏఐ, సెమీ కండక్టర్లతో సహా నూతన, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి మేం కృషి చేస్తాం. మన ప్రజలను అనుసంధానించే నాగరికత, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేసే అవకాశంగా సైతం ఈ పర్యటన ఉంటుంది.

జపాన్ నుంచి.. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు టియాన్జిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు చైనాకు వెళతాను. ఎస్‌సీవోలో భారత్ చురుకైన, నిర్మాణాత్మక సభ్యురాలు. దీనికి మనం అధ్యక్షత వహించిన సమయంలో కొత్త ఆలోచనలను పరిచయం చేశాం. ఆవిష్కరణ, ఆరోగ్యం, సాంస్కృతిక వినిమయం రంగాల్లో సహకారాన్ని ప్రారంభించాము. ఉమ్మడి సవాళ్లను పరిష్కరించడానికి, ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడానికి ఎస్‌సీవో సభ్యులతో కలసి పనిచేసేందుకు భారత్ కట్టుబడి ఉంది. ఈ శిఖరాగ్ర సమావేశంలో అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, అధ్యక్షుడు పుతిన్, ఇతర నాయకులతో సమావేశమయ్యేందుకు ఎదురుచూస్తున్నాను.

జపాన్, చైనాలో నా పర్యటనలను మన దేశ ఆసక్తులను, ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్తాయని, ప్రాంతీయ, ప్రపంచ శాంతిని, భద్రతను, సుస్థిరాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో ఫలప్రదమైన సహకారానికి దోహదపడతాయని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను.

# ఇందిరమ్మ ఇళ్లకు.. ఫ్లైయాష్ బ్రిక్స్...



భద్రాద్రి కొత్తగూడెం: బీటీపీఎస్ పరిసర ప్రాంతాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరలో ఫ్లైయాష్ బ్రిక్స్‌ను అందిచఆగష్టు 29:ందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు మండలంలోని బీటీపీఎస్ కర్మాగారానికి చెందిన ఫ్లై యాష్ పాండ్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాష్ ప్లాంట్ సమీపంలోని ఇటుకల తయారీ కేంద్రానికి సన్నాహాలు చేస్తున్నామని, యాష్‌తో పాటు స్థానికంగా ఇసుక వనరులు కూడా ఉండటంతో ఇటుకల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే లబ్ధిదారులకు ఇటుకలను సరఫరా చేయవచ్చునన్నారు.

దీంతో వారికి ఊరట లభించడంతో పాటు సరసమైన ధరలకు ఇటుకలను సరఫరా చేసినట్లవుతుందన్నారు. ఈ ప్లాంట్ నిర్మాణంతో స్థానిక యువతకు శిక్షణనిప్పించి ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు తీసుకుంటామన్నారు. డ్వాక్రా సంఘాలతో పాటు స్థానిక మహిళలకు ఈ పరిశ్రమ నిర్వహణ బాధ్యతలను అప్పగించే యోచనలో ఉన్నట్టు తెలిపారు. ఈప్రాంతంలో ఉన్న మహిళా సంఘాలకు తేనెటీగల పెంపకంపై నైపుణ్య శిక్షణ ఇప్పించి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు చర్యలు తీసుకోవాలని,

బీటీపీఎస్ ప్లాంట్‌తో కాలుష్యం వెదజల్లుతుండటం కారణంగా ప్రజలు స్థానికులు అనేక రోగాల బారిన పడుతున్నారని, హెల్త్ క్యాంపులు నిర్వహించి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కల్లెకర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, ఎస్ఈ రాంప్రసాద్, మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో వెంకటేశ్వరరావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు రాంబాబు, గౌతమి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సాంకేతిక సహకారానికి సంబంధించిన అవగాహనా ఒప్పందంపై భారత్, భూటాన్ సంతకం

న్యూఢిల్లీ, ఆగష్టు 29:వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా అవగాహనా ఒప్పందం (ఎంవోయూ)పై భారత వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ దేవేశ్ చతుర్వేది, భూటాన్ రాజ ప్రభుత్వ వ్యవసాయం, పశుసంవర్ధక మంత్రిత్వ శాఖ (ఎంవోఏఎల్) కార్యదర్శి శ్రీ థిన్లే నాంగ్యేల్ సంతకాలు చేశారు.

ఈ ఎంవోయూపై సంతకం చేయడం భారత్, భూటాన్ మధ్య కొనసాగుతున్న భాగస్వామ్యంలో కీలకమైన విజయాన్ని సూచిస్తుంది. అలాగే ఆహార భద్రత, సుస్థిరమైన వ్యవసాయం, గ్రామీణ సంక్షేమంలో రెండు దేశాల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. వ్యవసాయ పరిశోధన, ఆవిష్కరణలు, పశు సంపద ఆరోగ్యం, ఉత్పత్తి, దిగుబడి అనంతర నిర్వహణ, విలువ ఆధారిత వ్యవస్థ, అభివృద్ధి, విజ్ఞానం, నైపుణ్యాలు సహా ఎంవోయూలో పేర్కొన్న వివిధ రంగాల్లో సహకారానికి ఈ ఒప్పందం ఓ మార్గదర్శన పత్రంలా పనిచేస్తుంది. ఎంవోయూను అమలు చేసే దిశగా.. జాయింట్ టెక్నికల్ వర్కింగ్ గ్రూపు (జేటీడబ్ల్యూజీ) మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జేటీడబ్ల్యూజీ నిబంధనలను, సహకారం కుదుర్చుకున్న ప్రాధాన్య రంగాల్లో తక్షణ చర్యలకు అంగీకరిస్తూ.. రెండు దేశాలు సంతకాలు చేశాయి. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసే కీలకమైన మలుపుగా ఈ సమావేశం ప్రాధాన్యాన్ని రెండు దేశాలు అర్థం చేసుకున్నాయి.

భారత్ ప్రాధాన్యాలు, సవాళ్లతో పాటు.. ప్రభుత్వం ప్రారంభించిన సృజనాత్మక కార్యక్రమాల గురించి శ్రీ చతుర్వేది వివరించారు. డిజిటల్ పరిష్కారాలను ఉపయోగించడం, వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు ప్రోత్సహించడం, ముప్పును తగ్గించడం, రైతులకు రుణాలు అందించడం కొత్తగా ప్రారంభించిన కార్యక్రమంలో ఉన్నాయి.

వ్యవసాయం, పశు సంవర్ధకం, వ్యవసాయ మార్కెటింగ్, సహకార సంఘాలు, ఆహార శుద్ధి, విత్తన రంగం, పరిశోధన, సాంకేతిక సహకారం, సామర్థ్య నిర్మాణం వంటి కీలకమైన రంగాల్లో భాగస్వామంపై జేటీడబ్ల్యూజీ సమావేశంలో ఇరు పక్షాలు సమగ్రంగా చర్చించాయి.

ఇద్దరికీ అనుకూలమైన తేదీన భారత్‌లో తర్వాతి జేటీడబ్ల్యూజీ సమావేశం నిర్వహించేందుకు రెండు పక్షాలు అంగీకరించాయి. భారత్, భూటాన్ మధ్య ఉన్న దృఢమైన సంబంధాలను దృష్టిలో ఉంచుకొని, రెండు దేశాల మధ్య స్నేహం, సహకారం మరింత బలోపేతం చేసేలా భూటాన్లో వ్యవసాయ కార్యదర్శి పర్యటన సాగింది.

# వర్షాలు, వరదలతో సెస్ కు సుమారు రూ.50 లక్షల నష్టం

-సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు
-రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
-విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రతలు పాటించాలి
-వర్షాలు తగ్గగా మరమత్తులు పూర్తి చేస్తాం
-అత్యవసర సమయాల్లో సమాచారం ఇవ్వండి
-రైతులు, వినియోగదారులు ఆందోళన చెందొద్దు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29:వర్షాలు, వరదలతో జిల్లా లో సెస్ సంస్థకు సుమారు రూ. 50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేసినట్లు సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. తంగళ్ళపల్లి మండలంలోని కస్బ కట్కూర్, వేణుగోపాల్ పూర్, గండిలచ్చపేట గ్రామాల్లో నష్టపోయిన



విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫర్లను ఆయన సెస్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడారు. జిల్లాలో సుమారు రూ. 50 లక్షల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. భారీ వర్షాలు వరదలతో విద్యుత్ పరంగా ప్రాణనష్టం జరగలేదని పేర్కొన్నారు. వరదలు వర్షాలు తగ్గినంక పూర్తిస్థాయి నష్టపరిహారం అంచనా వేసి, మిరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపడతామన్నారు. వర్షాలతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని, రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో విద్యుత్ సిబ్బందికి అధికారులకు సమాచారం అందించాలన్నారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట పరిధిలో రామంజపురం లో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు.రామంజపురం కు వెళ్లడానికి వీ లులేదని, రెండు వైపులా నీటి ప్రవా హంతో దాటలేని పరిస్థితి ఉందన్నా రు. నీటి ఉధృత తగ్గినంక అవసరమైతే రెండో విద్యుత్ లైన్ వేసిన గ్రామానికి విద్యుత్ సరమ అందిస్తామన్నారు.

ఈరోజు తంగళ్ళపల్లి మండలంలో పలు గ్రామాలను పరిశీలించానని, సుమారు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు నష్టం జరిగినట్లు పేర్కొ న్నారు. విద్యుత్తు లైన్లు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ అవసరమైన చోట తక్షణమే ఏర్పాటు చేస్తామన్నారు. వరదలతో సెస్ పాలక వర్గం, సెస్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నామని, అందరీ సహకారంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూశామని పేర్కొన్నారు. ఈ సమావేశం లో సెస్ ఏడీ ఈ శ్రీధర్, ఏ ఈ మధుకర్, సిబ్బంది ఉన్నారు.

# ఉత్తరాఖండ్ లోని రూర్కీ జిల్లాలో జబ్రేడా ప్రాంతంలో ఏడేళ్ల బాలుడిపై ఓ మసీదు ఇమాం లైంగిక దాడి

న్యూఢిల్లీ, ఆగష్టు 29:2025 ఆగస్టు 20న ఉత్తరాఖండ్‌లోని రూర్కీ జిల్లాలో, జబ్రేడా ప్రాంతంలో ఓ మసీదులో ఏడేళ్ల బాలుడిపై ఇమాం లైంగిక దాడికి పాల్పడినట్లు వచ్చిన వార్తా కథనాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) సుమోటోగా స్వీకరించింది. బాధిత బాలుడు మసీదుకు చదువుకోవడానికి వెళ్లాడని కథనంలో పేర్కొన్నారు.మీడియాలో వచ్చిన కథనాన్ని గమనించిన కమిషన్, అదే నిజమని తేలితే బాధితుని మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అంశంగా దీన్ని తీవ్రంగా పరిగణిస్తుంది. కాబట్టి, ఈ ఘటనపై రెండు వారాల్లోగా పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని రూర్కీ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, పోలీస్ సూపరింటెంట్‌కు నోటీసులు జారీ చేసింది.ఆగస్టు 22న ప్రచురితమైన వార్తా కథనం ప్రకారం బాలుడిని నిందితుడు తన గదిలోకి బలవంతంగా తీసుకెళ్లి ఈ దారుణానికి పాల్పడ్డాడు.

# పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపును 2025 డిసెంబరు 31 వరకు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 29:దేశ జౌళి రంగానికి పత్తి అందుబాటును పెంచడానికి, కేంద్ర ప్రభుత్వం పత్తిపై దిగుమతి సుంకాన్ని తాత్కాలికంగా.. ఈ నెల 19 మొదలు వచ్చే నెల (2025 సెప్టెంబరు) 30వ తేదీ వరకు.. మినహాయించింది. ఎగుమతిదారు సంస్థలకు మరింత ఊతాన్ని అందించే ఉద్దేశంతో, పత్తి (హెచ్ఎస్ 5201 రకం)పై దిగుమతి సుంకం మినహాయింపును సెప్టెంబరు నెలాఖరు నుంచి ఈ సంవత్సరం డిసెంబరు 31 వరకు పొడిగించాలని తాజాగా నిర్ణయించింది.

# బాల్య వివాహాలకు కారణం పేదరికమే : డాక్టర్ అశోక్

మహబూబాబాద్ ఆగస్టు 29:తరాల మధ్య పేదరికం కొనసాగించడంలో బాల్య వివాహాలే ప్రధాన కారణమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి పోలీసు స్టేషన్ ఆవరణలో బాల్యవివాహాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకముందు అమ్మాయికి, 21 సంవత్సరాలు నిండకముందు అబ్బాయికి వివాహం జరపడం చట్టరీత్యా నేరమని, ఎంతటి వారినైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిన్న వయసులో పెళ్లి చేసుకున్న వారిలోనే గృహహింస అధికమని, అదే విధంగా తరాల మధ్య పేదరికం కొనసాగుతుందని, మహిళలు అట్టడుగు స్థాయిలోనే మిగిలిపో తున్నారని వివరించారు. చిన్న వయసులో గర్భధారణ, కుటుంబ బాధ్యతలు వ్యక్తిగతంగా, సమాజపరంగా తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని అన్నారు.

ఈ సందర్భంగా కురవి ఎస్ఐ గుండ్రాతి సతీష్ మాట్లాడుతూ.. శిశు మరణాలు, పురిటి మరణాలకు ప్రధాన కారణం బాల్యవివాహాలేనని గుర్తుచేశారు. బాల్య వివాహాలు అడ్డుకోవడం సమాజంలో అందరి బాధ్యత అన్నారు. సదస్సులో పోస్టర్లు ఆవిష్కరించి, పాల్గొన్న వారితో బాల్యవివాహాలు చేయనివ్వమని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బత్తుల వెంకటయ్య, ఉమెన్ కానిస్టేబుళ్లు అనిత, మాధవి, స్థానికులు గిరి, హుస్సేన్, లక్ష్మణ్, కోటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక యూరోపియన్ ట్రెబుల్ తర్వాత యువ ఫుట్ బాలర్లను

న్యూఢిల్లీ, ఆగష్టు 29:మొహాలీలోని మినర్వా ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన యువ ఫుట్‌బాలర్లను యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈ రోజు న్యూఢిల్లీలో సత్కరించారు. యూరోప్‌లో వారు సాధించిన విజయాలు భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుకు నూతన ప్రారంభంగా వర్ణించారు.

22 మంది ఆటగాళ్లతో కూడిన అండర్ - 14/15 జట్టు ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో గోథియా కప్ (స్వీడన్), ది డానా కప్ (డెన్మార్క్), నార్వే కప్ (నార్వే) గెలిచి మొదటిసారిగా యూరోపియన్ ట్రెబుల్‌ను పూర్తి చేసి చరిత్ర సృష్టించింది.

"అంతర్జాతీయంగా ఫుట్‌బాల్ క్రీడలో భారత్ మరింత కీర్తి సాధించాలనే తపనకు ఇది నూతన ఆరంభం" అని డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు.

యువ క్రీడాకారులు ఎక్కడ పోటీపడుతున్నా 'దేశమే ముందు' అనే అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కేంద్ర మంత్రి కోరారు.

"స్పోర్ట్స్ సైన్స్, పోషకాహారం, సైకాలజిస్టుల ద్వారా మానసిక దృఢత్వానికి యువ క్రీడాకారులు మరింత ప్రాధాన్యమివ్వాలి. ఇది భారత్‌ను విజయపథంలో నడిపిస్తుంది.

ఈ యువకులు అధిక విశ్వాసాన్ని, క్రీడ పట్ల మక్కువను కొనసాగించాలని" అని డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు.

ఈ మూడు ఫుట్ బాల్ పోటీలను ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైనవిగా పరిగణిస్తారు. ఈ బృందం 26 అంతర్జాతీయ మ్యాచుల్లో 295 గోల్స్ చేసి అజేయంగా నిలిచింది. అదే సమయంలో సౌత్ అమెరికా, యూరోప్, ఇతర దేశాలకు చెందిన యూత్ క్లబ్బులకు అతి తక్కువ గోల్స్ ఇచ్చింది.

మినర్వా అకాడమీ ఎఫ్‌సీ ఖేలో ఇండియా గుర్తింపు పొందింది. గోథియా కప్ 2025లో భారత్ నుంచి యూ-14 జట్లతో పాల్గొన్న ఆరు క్లబ్బుల్లో ఇది కూడా ఒకటి. స్వీడన్‌లో యూత్ కప్‌గా పిలిచే గోథియా కప్ 2025 ఫైనల్లో అర్జెంటీనాకు చెందిన ఎస్కులా డె ఫుట్ బాల్ 18 టుకుమాన్ జట్టుపై 4-0 తేడాతో గెలుపొందింది.

కొంతోజమ్ యోహెన్బా సింగ్ (ఉత్తమ క్రీడాకారుడు, గోథియా కప్), హుయిడ్రోమ్ టోనీ (ఉత్తమ ప్లేయర్, డానా కప్) లాంటి క్రీడాకారులు వ్యక్తిగత అవార్డులను పొందారు.

# నకిలీ పాస్ పుస్తకాల గుట్టురట్టు.. ముగ్గురు అరెస్టు



మహబూబాబాద్ ఆగస్టు 29: నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు తయారు చేసి వివిధ బ్యాంకుల్లో రూ.16,90,000 విలువగల రుణాలు ఇప్పించిన గుట్టును కురవి పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కురవి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వివరాలను వెల్లడించారు. కురవి మండలం నేరడ శివారు ఎల్కచెట్టు తండా జీపీ పరిధిలోని మంచ్యా తండాకు చెందిన మూడ్ బాలాజీ, మహబూబాబాద్ మండలం అమన్ గల్ శివారు కస్నా తండాకు చెందిన బానోత్ హరికిషన్, జాఫర్‌గడ్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన బానోత్ వర్జన్ ముగ్గురు కలిసి వివిధ మండలాల్లోని కొంతమంది రైతులకు మభ్య పెట్టి మీకు ఎక్కువ లోన్ ఇప్పిస్తాం అని, దానికి ఖర్చు అవుతుందని చెప్పి వారు ఒక్కో పాస్ బుక్ కి రూ.10వేలు వసూళ్లు చేశారు.

నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించి వివిధ బ్యాంకుల్లో ముగ్గురికి లోన్ రూ.16,90,000 విలువ గల లోన్స్ ఇప్పించారు. అలాగే మరల కొంతమంది వ్యక్తులవి నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేసి వీటికి నకిలీ 1బీ, ఈసీ లు తయారు చేయడానికి కురవికి వచ్చిన సమయంలో వీరిని పట్టుకున్నామన్నారు. ఈ కేసుతో సంబంధం ఉందని భావిస్తున్న కొంతమంది పరారీ లో వున్నారని వివరించారు. సమావేశంలో రూరల్ సీఐ సర్వయ్య, సీసీఎస్ సీఐ హత్తిరామ్, కురవి ఎస్ గంద్రాతి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వేపలగడ్డను పట్టించుకోని అధికారులు.. గిరిజనుల ఇబ్బందులు



ఖమ్మం, ఆగస్టు 29:లక్ష్మీదేవిపల్లి మండలంలోని వేపలగడ్డ ను అధికారులు పట్టించుకోకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. పంచాయతీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సమస్యలు ఎక్కడికక్కడే పడకేశాయి. పంచాయతీలో వివిధ పనులకు, చెత్తాచెదారం తీసేందుకు ఓ ట్రాక్టర్ ఉంది. [illegible] ఇప్పుడు శిథిలావస్థకు చేరింది. ఎక్కడి పారిశుధ్య పనులు అక్కడే పేరుకుపోయాయి. తాగు నీటి కోసం, మొక్కలకు నీళ్లు పోసేందుకు ఉన్న ట్యాంకర్ కూడా నిరుపయోగంగా ఉంది. గ్రామంలో సైడ్ డ్రైన్ సమస్య తీవ్రంగా ఉంది. వీధి దీపాలు వెలగడం లేదని, అధికారులు, పంచాయతీ సిబ్బంది ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రిని నియమించాలి : దాసగాని సుమ




జనగామ జిలా, ఆగస్టు 29 : రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ అన్నారు. శుక్రవారం బచ్చన్నపేట మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన మండల మహాసభకు ముఖ్యఅతిథిగా సుమ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్య రంగ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యారంగ సమస్యలు ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాకుండా పెండింగ్లో ఉన్నటువంటి ఎన్నిమిది వేల కోట్ల స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలి డిమాండ్ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా చదువుకునే విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలన్నారు. సంక్షేమ హాస్టల్లో చదువుకున్న విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలి అన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులా లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తామన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు యాకన్నా రాథోడ్, జిల్లా సహాయ కార్యదర్శి బొమ్మిశెట్టి ఆర్య మండల నాయకులు మురళి కృష్ణ, అరవింద్, రాకేష్, సాగర్, అరవింద్, నివేదిక, పూజిత, ఆనంద్, అఖిల్, శ్రీధర్, సాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్షిప్ బకాయిలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం : కేటీఆర్

హైదరాబాద్, ఆగష్టు 29:స్కాలర్షిప్ బకాయిలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్‌లను తక్షణమే విడుదల చేయించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిజాం కాలేజీ విద్యార్థిని సుమన ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు అభ్యర్థన చేయగా.. ఆయన స్పందించారు. ఈ అంశాన్ని తన దృష్టికి తీసుకొచ్చినందుకు థ్యాంక్యూ చెప్పారు కేటీఆర్.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో మీరు అత్యంత చురుకైన నాయకులలో ఒకరు. నిజాం కళాశాల పూర్వ విద్యార్థిగా, మీరు ఎక్స్ వేదికగా మా సమస్యలను ముందుగానే పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము అని సుమన అనే విద్యార్థిని ట్వీట్ చేశారు.

ఇటీవలే నేను నిజాం కాలేజీ నుంచి డిగ్రీ పూర్తి చేశాను. టీసీ తీసుకునేందుకు వెళ్తే.. ఆర్టీఎఫ్ రూ. 28 వేలు, ఎంటీఎఫ్ రూ. 14 వేలు చెల్లించాలని అడిగారు. ఇప్పటి వరకు తమకు ఫైనల్ ఇయర్ స్కాలర్‌షిప్ చెల్లించలేదు. మాది మధ్య తరగతి కుటుంబం.. దయచేసి తక్షణమే స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతున్నట్లు సుమన్ ప్రభుత్వాన్ని కోరారు.

# కల్లుగీత సొసైటీలు, టి ఎఫ్ టి గ్రామాలకే మద్యం షాపులలో రిజర్వేషన్స్ కల్పించాలి

**-ఇచ్చిన మాట ప్రకారం 25% ఇవ్వాలి.**
**-ప్రతి గీత కార్మికునికి టూ వీలర్ బైక్ ఇవ్వాలి**
**-ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలి.**
**-కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్**



ములుగు, ఆగష్టు 29:రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గౌడులకు 15% రిజర్వేషన్స్ కల్పిస్తూ తెచ్చిన మద్యం పాలసీ వల్ల గీత కార్మికులకు ఏమి ప్రయోజనం లేదు. కల్లుగీత సొసైటీలకు, టి ఎఫ్ టి గ్రామాలకు ఇవ్వాలని. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి బుర్ర శ్రీనివాసుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈరోజు ములుగు జిల్లాకేంద్రం లోని.సంఘం కార్యాలయంలో రంగు సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో వారు మాట్లాడుతూమద్యం షాపులలో రిజర్వేషన్స్ పెంచితే ప్రభుత్వానికి లాభం తప్ప నష్టం ఉండదన్నారు.మద్యం షాపుల టెండర్లలో గౌడులకు 15% ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్స్ గత టీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గౌడులకు 25 శాతం పెంచుతామని చెప్పిందని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు.

మద్యం వల్ల కల్లుగీత వృత్తి దెబ్బ తింటుందని గత టిఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్ గారి చొరవతో మద్యం వేలం పాటల్లో గౌడులకు 15% రిజర్వేషన్స్ కల్పించారు. ఫలితంగా 392 మంది ఉపయోగించుకున్నారు కానీ దీని వల్ల ఇచ్చిన ఉద్దేశం నెరవేర లేదన్నారు. కల్లుగీత సొసైటీలకు,ఏఈు గ్రామాలకు ఇచ్చినట్లయితే ఆర్థికంగా గీత కార్మికులకు ఉపయోగం జరుగుతుందన్నారు.అందుకని ప్రభుత్వం పునరాలోచించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు.

బేవరేజెస్, డిస్టలరీస్, బాటిలింగ్ తదితర మద్యం ఉత్పత్తి రంగంలో కూడా రిజర్వేషన్స్ కల్పిస్తే సొసైటీలు బలోపేతం అవుతాయని గీత కార్మికులకు ఉపాధి కలుగుతుందన్నారు. ప్రమాదానికి గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్ గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలని, ప్రమాద నివారణకు వృత్తి చేసే వారందరికీ సేఫ్టీ కిట్టులు ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన కొత్త వారికి పెన్షన్ అమలు చేయాలని, ×నందనములోని నీరా మరియు తాటి ఈత ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించాలని మరియు ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గీత కార్మికులు పోరాటానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్ పులి రమేష్ గౌడ్ ఉయ్యాల మధుకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ తపాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్, ఆగష్టు 29: భారతీయ తపాలా జీవిత బీమా భారతీయ పౌరులకు ఆర్థిక భద్రతను కల్పించేందుకు దోహదపడుతుందని కుబీర్ పోస్ట్ ఆఫీస్ సీనియర్ బీపీఎం పుప్పాల రాజేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అసిస్టెంట్ బీపీఎం బి. నవీన్ తో కలిసి నిర్మల్ జిల్లా కుబీర్ మండలం పార్డి (కె) గ్రామంలో ఇంటింటికి తిరిగి గ్రామస్తులకు భారతీయ పోస్టల్ బీమా పథకాలపై అవగాహన కల్పించారు. రోజువారీ తో పాటు క్వార్టర్లీ, ఆఫ్ ఇయర్లీ, ఇయర్లీ ప్రీమియం చెల్లించుట కోవచ్చన్నారు.

ఈ పథకాలు గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం రూపొందించబడ్డాయి. వీటికి పెట్టుబడితో జీవిత బీమా యొక్క ద్వంద్వ ప్రయోజనాలను అందిస్తాయి. ఈ పథకాలు పాలసీదారులకు జీవిత బీమాతో పాటు, మనీ-బ్యాక్, ఎండోమెంట్, మొత్తం జీవిత బీమా వంటి ప్రయోజనాలను అందిస్తాయని పేర్కొన్నారు. ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన, గ్రామీణ తపాలా బీమా, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, పీఎల్ఐతో పాటు రికరింగ్ డిపాజిట్ (ఆర్డీ), నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎన్ఎస్సీ), కిసాన్ వికాస పత్ర(కెవిపి), మహిళా సమాన్ సేవింగ్ పథకాలున్నాయని వివరించారు.

పోస్టల్ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు పొదుపు చేసుకుని ఆర్థిక భద్రతకు బాటలు వేసుకోవాలని కోరారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో పథకాల గురించి వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఐపీపీబీ, ఎస్బీ ఖాతాలు, ఆడపిల్లల భద్రత కోసం సుకన్య సమృద్ధి యోజన పథకాలను తీసుకున్నారు. ఫోన్ చేసిన వెంటనే ఇంటికి వచ్చి పోస్టల్ సేవలు అందిస్తామని ఆయన తెలిపారు.

# లిక్కర్ స్కాంను సృష్టించి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు - భూమన

అమరావతి, ఆగష్టు 29: ఏపీలో కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. లేని లిక్కర్ స్కాంను సృష్టించి వైసీపీ నాయకులను, అధికారులను అరెస్టు చేశారని అన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాసు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిశారు. ఈ సందర్భంగా జైలు బయట వారు మాట్లాడారు.

అక్రమ కేసులు పెడుతూ కేసులతో వేధిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రభుత్వాన్ని నిలదీస్తునే ఉంటామని వెల్లడించారు. మిథున్ రెడ్డి మానసికంగా ధైర్యంగా ఉన్నారని, వైసీపీ శ్రేణులు భయపడేది లేదని అన్నారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలనే లక్ష్యాన్ని ఏపీ పోలీసులు మరిచిపోయారని విమర్శించారు.

# కోడ్రైవర్‌కు స్టీరింగ్ అప్పగించి.. బస్సులోనే ప్రాణాలు వదిలిన డ్రైవర్

న్యూఢిల్లీ, ఆగష్టు 29:రాజస్థాన్ లో హృదయవిదారక ఘటన చోటు చేసుకుంది. డ్రైవింగ్ సమయంలో డ్రైవర్ అనారోగ్యానికి గురికావడంతో.. ముందు జాగ్రత్తగా స్టీరింగ్ కో డ్రైవర్‌కు ఇచ్చి ప్రయాణికులను కాపాడాడు. అనంతరం బస్సులోనే ప్రాణాలు వదిలాడు.

వివరాల్లోకి వెళితే.. సతీశ్ రావు అనే వ్యక్తి ఇండోర్ నుంచి జోధ్‌పూర్ వెళ్లే ప్రైవేట్ బస్సును నడుపుతున్నాడు. అయితే, మార్గం మధ్యలో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ముందు జాగ్రత్తగా కో డ్రైవర్‌ను డ్రైవింగ్ చేయమని చెప్పాడు. డ్రైవింగ్ సీట్‌లో నుంచి పక్కకు జరిగి కూర్చున్నాడు. ఇంతలో హెల్పర్ సమీపంలోని మెడికల్ స్టోర్ వద్దకు వెళ్లగా.. అది మూసివేసి ఉంది. వేరేచోటుకు వెళ్తున్న క్రమంలోనే సతీశ్ రావు కూర్చున్న చోటే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో బస్సులోని వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అయితే, చివరి నిమిషంలో స్టీరింగ్ హెల్పర్‌కు ఇవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా సేఫ్‌గా ఉన్నారు. అయితే, అతడు గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు నిర్ధరించారు.

# వాటర్ పైపులైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఆగష్టు 29 : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శ్రీసాయిబాలాజీ టౌన్‌షిప్‌లో అమృత్ పథకంలో భాగంగా రూ.76లక్షలతో చేపట్టనున్నా వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీని మరింత సుందరంగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు.శ్రీసాయిబాలాజీ టౌన్షిప్‌లో విద్యుత్, మురుగుకాలువ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని, సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు తిరుపతిరెడ్డి, రఘు, శివశంకర్, ముబారక్, మురళీమోహన్, ప్రవీణ్, శ్రీకాంత్, ఖదీర్, మాధవులు, కరుణాకర్, రవితేజ, దిలీప్, శ్రీధర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆర్థిక సమ్మిళితత్వం దిశగా పెనుమార్పులు తెచ్చిన ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) పథకానికి 11 ఏళ్లు

న్యూఢిల్లీ, ఆగష్టు 29:మన దేశ ఆర్థిక ముఖచిత్రంలో 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' (పీఎంజేడీవై) పెనుమార్పును తీసుకువచ్చింది. ఈ పథకాన్ని 2014 ఆగస్టు 28న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ రోజుతో, ఈ పథకానికి 11 సంవత్సరాలు పూర్తయ్యాయి. బ్యాంకింగ్ రంగానికి ఆమడదూరంలో నిలిచిపోయిన లక్షలాది పౌరులకు బ్యాంకుల సేవలను పీఎంజేడీవై అందుబాటులోకి తీసుకువచ్చి ఒక కొత్త నిర్వచనాన్ని చెప్పింది.

ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఒక సందేశాన్నిస్తూ... "ఆర్థిక సార్వజనీనత దేశ ఆర్థిక వృద్ధికీ, అభివృద్ధికీ ఒక కీలక ఇంజిన్. దేశంలో పౌరులందరికీ బ్యాంకు ఖాతాలు ఉంటే ముఖ్యంగా పేదలు, ఆదరణకు నోచుకోకుండా మిగిలిన వర్గాల వారు కూడా ఆర్థిక వ్యవస్థలో పూర్తి స్థాయిలో పాలుపంచుకొని, వివిధ అవకాశాలను అందుకోగలుగుతారు" అని మంత్రి తన సందేశంలో వ్యాఖ్యానించారు.

"ప్రయోజనాలను నేరుగా బదిలీ చేసే (డీబీటీ) సదుపాయాన్ని వినియోగించుకొంటూ వివిధ పథకాల కింద ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లక్షిత లబ్ధిదారులకు చేర్చడంలో ప్రధాన పాత్రను పోషిస్తున్న స్కీముల్లో పీఎంజేడీవై ఒకటి. రుణ సౌకర్యంతో పాటు సామాజిక భద్రత కూడా దీంతో లభిస్తోంది. పొదుపు మొత్తాలు, పెట్టుబడులు పెరుగుతున్నాయి" అని కేంద్ర మంత్రి అన్నారు.

"గత పదకొండు సంవత్సరాల్లో, 56 కోట్ల కన్నా ఎక్కువ స్థాయిలో జన్ ధన్ ఖాతాలను తెరిచారు. వీటిలో మొత్తం రూ.2.68 లక్షల కోట్లు జమ అయ్యాయి. 38 కోట్ల కన్నా ఎక్కువ రూపే కార్డులను ఎలాంటి రుసుమునూ తీసుకోకుండానే జారీ చేశారు. దీంతో డిజిటల్ మాధ్యమంలో లావాదేవీలు పూర్తి అవుతున్నాయి'' అని శ్రీమతి సీతారామన్ వివరించారు.

''పీఎంజేడీవైలో భాగంగా తెరిచిన ప్రతి వంద ఖాతాల్లో 67 ఖాతాలను తెరిచింది గ్రామీణ ప్రాంతాలు, సెమీ అర్బన్ ప్రాంతాల వారే. మళ్లీ ఈ ఖాతాల్లో 56 శాతం ఖాతాలు మహిళలు తెరిచిన ఖాతాలే. దీనిని బట్టి చూస్తే... దేశంలో మారుమూల ప్రాంతాల్లో నివసిస్తూ, ప్రభుత్వ సేవలలో చాలా వరకు సేవలను అందుకోలేకపోతున్న వ్యక్తుల్ని ఆర్థిక రంగం పరిధిలోకి చేర్చినట్లు స్పష్టం అవుతోంది" అని ఆర్థిక మంత్రి అన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శ్రీ పంకజ్ చౌదరి ఒక సందేశాన్నిస్తూ... "దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన ఆర్థిక సార్వజనీనతా ప్రధాన కార్యక్రమాల్లో పీఎంజేడీవై ఒకటి. ఆత్మగౌరవానికీ, సాధికారతకూ, అవకాశానికీ మారుపేరుగా జన్ ధన్ యోజన నిలిచింది" అని అన్నారు.

ప్రతి కుటుంబానికి ఒక బ్యాంకు ఖాతాతో పాటు వయోజనుల్లో ప్రతి ఒక్కరికీ బీమా, పింఛనుల రక్షణ లభించాలని ప్రధానమంత్రి 2021 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించారు. ఈ దిశగా దేశం నలు మూలల వివిధ కార్యక్రమాలను అమలుచేయడానికి ప్రయత్నాలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నాం. బ్యాంకు ఖాతాల విషయంలో దాదాపుగా అందరికీ ఆ ఖాతాలను సమకూర్చాం. దేశవ్యాప్తంగా బీమా, పింఛను రక్షణ పరిధి కూడా నిరంతరంగా పెరుగుతోంది" అని శ్రీ పంకజ్ చౌదరి వివరించారు.

"దేశంలో 2.7 లక్షల గ్రామ పంచాయతీల్లోని ప్రతి ఒక్క గ్రామ పంచాయతీలో కనీసం ఒక శిబిరాన్నయినా నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకొని, ఒక ప్రచార కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. అర్హులైన వారంతా ఈ శిబిరంలో పీఎంజేడీవై ఖాతాలను తెరిచి, జన్ సురక్ష పథకాల్లో పేర్లను నమోదు చేసుకోవచ్చు. వారు మరోసారి తమ కేవైసీని పూర్తిచేసి, బ్యాంకు ఖాతాల్లో నామినేషన్లను తాజాగా పేర్కొనవచ్చును. ఆర్థిక రంగ సేవల్ని సామాన్యుల ముంగిటికే తీసుకుపపోవాలన్నది మా ప్రయత్నం. ఈ నూటికి నూరుశాతం ప్రచార కార్యక్రమం సెప్టెంబరు 30న ముగియనుంది. ఇప్పటివరకు అందిన నివేదికలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి. ఈ ప్రచార కార్యక్రమం పూర్తి ప్రయోజనాలను అందుకోవాల్సిందిగా మీ అందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పేర్కొన్నారు.

"బ్యాంకులు, బీమా కంపెనీలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆసక్తిదారులు అందరి మద్దతుతోను, మేం మరింత విస్తృత ఆర్థిక సార్వజనీన సమాజాన్ని ఆవిష్కరించే దిశగా ముందుకు పోతున్నాం. దేశంలో ఆర్థిక సార్వజనీనత అంశంలో పెనుమార్పును తీసుకువచ్చిన పథకంగా పీఎంజేడీవైని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారు. మిషన్ మోడ్‌లో పరిపాలనను అందించడానికి ఒక ముఖ్య ఉదాహరణగా 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' నిలుస్తుంది. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నప్పుడు ఏవేం సాధించగలుగుతుందనే దానిని కూడా ఈ పథకం చాటిచెబుతుంది" అని శ్రీ పంకజ్ చౌదరి అన్నారు.

ఆర్థిక సార్వజనీనత పరిధి విస్తరణ:

సమాజంలోని ఆదరణకు దూరంగా ఉండిపోయిన, ఆర్థికంగా బలహీనులైన వర్గాల వారికి సహాయపడడానికి పటిష్ఠ ఆర్థిక సార్వజనీనత వ్యూహాలను అమలుచేసేందుకు ఆర్థిక శాఖ కట్టుబడి ఉంది. బ్యాంకింగ్ రంగానికి బయట ఉండిపోయిన ప్రజలకు ఒక మౌలిక బ్యాంకు ఖాతా సౌకర్యాన్ని అందించాలనే లక్ష్యంతో పీఎంజేడీవైని ప్రారంభించారు. ఈ ఖాతాలో కనీసం ఇంత డబ్బును నిల్వ ఉంచాలనే, అకౌంటు నిర్వహణ రుసుములు చెల్లించాలనే నిబంధనలు ఏవీ లేవు.

ప్రతి ఖాతాదారుకు ఒక ఉచిత రూపే డెబిట్ కార్డును ఇస్తారు. దీంతో పాటు, రూ.2 లక్షల విలువైన ప్రమాద బీమా రక్షణను కల్పిస్తారు. ఇది డిజిటల్ లావాదేవీల సౌలభ్యంతో పాటు ఆర్థిక భద్రతను అందిస్తుంది. రూ.10,000 వరకు అదనపు సొమ్ము తీసుకోవడానికీ ఖాతాదారులు అర్హులు. ఇది వారికి అత్యవసర స్థితుల్లో ఉపయోగపడుతుంది.

పిఎంజెడివై ఖాతాల ముఖ్య లక్షణాలు:

కేవైసీ నియమాలను తూచా తప్పక పాటించిన ఖాతాల్లో కనీసంగా ఇంత మొత్తం డబ్బును నిల్వ ఉంచాలన్న ఆంక్షగాని, కనీసం ఇన్ని లావాదేవీలు చేయాలన్న పరిమితి గాని లేదు. ఇది ఒక బీఎస్‌బీడీ ఖాతా. ఈ కింది సదుపాయాలను ఎలాంటి రుసుమూ చెల్లించకుండానే పీఎంజేడీవై ఖాతాదారులకు సమకూరుస్తారు:

ఏదైనా డిజిటల్ మార్గం ద్వారాగానీ లేదా కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలు, విభాగాలు జారీ చేసిన చెక్కులను డిపాజిట్ చేయవచ్చు లేదా ఆ చెక్కుల్లో పేర్కొన్న నగదును స్వీకరించవచ్చు.

ఒక నెల రోజుల్లో నగదును ఎన్ని సార్లు జమ చేయాలనిగానీ లేదా ఎంత డబ్బును జమ చేయాలనిగానీ ఎలాంటి పరిమితీ లేదు.

మెట్రో ఏటీఎంలు సహా ఏ ఏటీఎంల నుంచి అయినా కానీ నెల రోజుల్లో కనీసంగా 4 సార్లు నగదును ఎలాంటి రుసుం చెల్లించనక్కర్లేకుండా తీసుకోవచ్చు. 4 విత్‌డ్రాయల్స్ కు మించితే, తదుపరి లావాదేవీలకు రుసుం వసూలు చేసుకొనేందుకు బ్యాంకులకు అవకాశం ఉంది.

గత 11 సంవత్సరాలుగా, పీఎంజేడీవై పరివర్తనతో పాటు దిశాత్మక మార్పునకు దారితీసింది. సమాజంలో నిరుపేదలు, శివారు ప్రాంతాల పౌరులకు కూడా సేవ చేయడానికి వీలుగా బ్యాంకింగ్ అనుబంధ విస్తారిత వ్యవస్థను ఈ పథకం పటిష్ఠపరిచింది. ప్రయోజనాలను నేరుగా బదిలీ చేసేందుకు (డీబీటీ) ఈ పథకం కీలకంగా మారింది. దీంతో ప్రభుత్వ సబ్సిడీలతో పాటు చెల్లింపులు పారదర్శకంగా, సమర్థంగా, అవినీతికి తావు లేకుండా సాగాయి.

అవ్యవస్థీకృత రంగంలో లక్షల మంది శ్రామికులకు జీవిత బీమాను, ప్రమాద బీమాను అందించడంలో పీఎంజేడీవై ఖాతాలు ముఖ్య పాత్ర పోషించాయి. ఈ ప్రక్రియలో భాగంగా ప్రధాన్ మంత్రీ జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన్ మంత్రీ సురక్ష బీమా యోజన వంటి జన్ సురక్ష పథకాలు తోడ్పడ్డాయి.

జేఏఎంతో పెద్ద మార్పు

జన్-ధన్-ఆధార్ మొబైల్ (జేఏఎం).. ఈ మూడు అంశాల్లోను పీఎంజేడీవై కీలకంగా మారిపోయింది. సబ్సిడీలను.. అవి చేరవలసిన వర్గాలకు కాకుండా.. ఇతర అనర్హులకు చేర్చడానికి అనుసరిస్తున్న పద్ధతులను ఈ విధానంలో అరికడుతున్నారు. జేఏఎంల భాగంగా, ప్రభుత్వం సంక్షేమ పథకాల ప్రయోజనాలను అణగారిన వర్గాల వారికి చెందిన బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయగలిగింది. దీంతో మధ్యవర్తుల ప్రమేయాన్ని, జాప్యాన్ని అడ్డుకోవడం సాధ్యమైంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ డీబీటీ పథకాల్లో భాగంగా రూ.6.9 లక్షల కోట్ల డబ్బును బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

ఆర్థిక సార్వజనీనత పథకాలను జనాభాలో అందరి చెంతకు చేర్చేందుకు ఉద్దేశించిన ప్రచార ఉద్యమం (01.07.2025 - 30.09.2025 మధ్య కాలంలో దీనిని అమలు చేస్తున్నారు): కేవైసీ వివరాలలో అవసరమైన మార్పుచేర్పులు చేసేందుకు, కొత్త ఖాతాలు తెరిచేందుకు, మైక్రో-ఇన్సూరెన్సు, పింఛను పథకాలను విస్తరించేందుకు బ్యాంకులు ఈ ఏడాది జులై 1 మొదలు సెప్టెంబరు 30 మధ్య కాలంలో శిబిరాలను నిర్వహిస్తున్నాయి. ఖాతాదారులు బ్యాంకింగ్ సేవలను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకోవడానికీ, ఖాతాలను ఉపయోగించుకోకుండా ఉండటాన్ని నివారించడానికీ ఖాతాదారులకు అవగాహన కలిగించేందుకు ప్రాధాన్యాన్నిస్తున్నారు. ఖాతాదారులను సంప్రదిస్తూ పీఎంజేడీవై పరిధిలోని ఖాతాల్లో ఎలాంటి లావాదేవీలు నమోదు చేయకుండా వాటిని నిద్రాణ స్థితిలోనే ఉంచకుండా కూడా బ్యాంకులు జాగ్రత్త చర్యలు తీసుకొంటున్నాయి. ఈ శాచ్యురేషన్ ప్రచార ఉద్యమాన్ని ఈసంవత్సరం జులై 1 నుంచి మొదలు పెట్టినప్పటి నుంచి వివిధ జిల్లాల్లో 1,77,102 శిబిరాల్ని నిర్వహించారు. ఈ శిబిరాల ద్వారా ముఖ్య పథకాల్లోకి లబ్ధిదారులను చేర్చుకొంటూ, వారికి ఆర్థిక లావాదేవీలను ఎలా చేయాలో చెబుతున్నారు.

ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై)లో మొత్తం డిపాజిట్ నిల్వలు రూ.2,67,756 కోట్లకు చేరుకొన్నాయి. ఖాతాల సంఖ్య మూడింతలు పెరగగా, మొత్తం డిపాజిట్లు దాదాపు 12 రెట్లు పెరిగాయి. (2015 ఆగస్టు, 2025 ఆగస్టు మధ్య కాలంలో)

ప్రతి ఒక్క ఖాతాకు సగటు డిపాజిటు 2025 ఆగస్టు 13 నాటికి రూ.4,768గా ఉంది. ఒక్కొక్క ఖాతాకు సగటు డిపాజిటు 2015 ఆగస్టుతో పోలిస్తే 3.7 రెట్లు పెరిగింది. సగటు డిపాజిట్లో వృద్ధి ఖాతాల ఉపయోగం పెరిగిందని, ఖాతాదారులు పొదుపు చేయడానికి అలవాటు పడుతున్నారని తెలియజేస్తోంది.

పీఎంజేడీవైలో భాగంగా 38.68 కోట్ల రూపే డెబిట్ కార్డులను జారీ చేయడం, 1.11 కోట్ల పీఓఎస్, ఎంపీఓఎస్ యంత్రాలను ఏర్పాటు చేయడంతోను, యూపీఐ వంటి మొబైల్ ఆధారిత చెల్లింపు వ్యవస్థల్ని ప్రవేశపెట్టడంతోను డిజిటల్ లావాదేవీల మొత్తం సంఖ్య 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,338 కోట్లకు పెరగింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఈ విధమైన లావాదేవీలు 535 కోట్ల స్థాయిలో నమోదయ్యాయి. ఇదే విధంగా, పీఓఎస్, ఈ-కామర్స్ లలో రూపే కార్డు లావాదేవీలు 2017-18 ఆర్థిక సంవత్సరంలో 67 కోట్ల స్థాయిలో ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 93.85 కోట్లకు ఎగబాకాయి.

పీఎంజేడీవై ఫలప్రదం అయిందంటే అందుకు దీనికి సంతరించిన మిషన్-మోడ్ దృష్టికోణం, నియంత్రణ పరంగా అందిస్తున్న మద్దతు, ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యాలతో పాటు బయోమెట్రిక్ ధ్రువీకరణకు గాను ఆధార్ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో దీనిని సంధానించడం.. ఇవన్నీ దోహదం చేశాయి.

ఇంతకు మందు ఆర్థిక వ్యవస్థలో భాగం పంచుకోని వారికి ఇది పొదుపు, రుణ సౌకర్యాలను కల్పించింది. పొదుపు మొత్తాలు ఏ స్థాయిలో ఉన్నదీ స్పష్టం అవుతున్న కారణంగా, ఖాతాదారులు ముద్రా రుణాలు సహా ఇతర రుణాలను పొందే వీలుంది. దీంతో, వ్యక్తులు తమ ఆదాయాన్ని పెంచుకోవచ్చు... ఆర్థిక ఇబ్బందులెదురైతే వాటితో సతమతం కాకుండానూ ఉండవచ్చు.

పీఎంజేడీవై 12వ ఏట అడుగుపెడుతున్న క్రమంలో, వృద్ధి ఫలాలను అందరికీ అందించడంలోను, డిజిటల్ నవకల్పనలోను, ఆర్థిక సాధికారత పరంగాను ఈ పథకం ఒక దారిదీపంగా వెలుగులీనుతూనే ఉంటుంది. ఈ పథకం వరుసగా అనేక విజయాల్ని సాధిస్తుండడం ఆర్థిక స్వాతంత్ర్య సాధన దిశగా సాగిస్తున్న ప్రయాణంలో ఏ ఒక్కరినీవదలిపెట్టకూడదన్న భారత్ నిబద్ధతకు అద్దం పడుతోంది.

# కాజీపేటలో 32 కిలోల గంజాయి పట్టివేత.. ముగ్గురు అరెస్ట్



కాజీపేట, ఆగష్టు 29: కాజీపేట రైల్వే జంక్షన్‌లోని ప్లాట్‌ఫారంపై గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు స్థానిక జి ఆర్ పి, సీఐ నరేష్ కుమార్ వెల్లడించారు. కాజీపేట జిఆర్పి స్టేషన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

రైల్వే స్టేషన్ లోని ప్లాట్‌ఫారంపై జీఆర్పీ ఎస్ఐ అభినవ్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం సాయంత్రం తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీలో భాగంగా ఇద్దరు పురుషులు, ఒక మహిళ చూసి అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో వారిని అదుపు లోకి తీసుకున్నామన్నారు. వారి వద్దనున్న రెండు బ్యాగులను తనిఖీ చేయడంతో అందులో 32 కిలోల గంజాయి బయటపడిందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితుడు చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్, ఆగష్టు 29: చిగురుమామిడి మండలంలోని రామంచ గ్రామానికి చెందిన పులి నారాయణ (60) రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కాగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఆర్ సాయికృష్ణ తెలిపారు. నారాయణ ఈనెల 22న ద్విచక్ర వాహనంపై ముల్కనూరు నుండి రామంచకు వెళుతుండగా ముల్కనూర్ ఊరి బయట క్రాస్ రోడ్ వద్ద ఇందుర్తి నుంచి వస్తున్న కారు నారాయణకు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కరీంనగర్లో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి సోదరుడు పులి రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కాగా మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు కలరు. పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో ప్రభుత్వం అతని కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గీట్ల తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఒంటెల కిషన్ రెడ్డి, సిద్ధెంకి రాజమల్లు, పులి కుమారస్వామి ప్రభుత్వాన్ని కోరారు. అతడి మృతి పట్ల గ్రామస్తులు సానుభూతి వ్యక్తం చేశారు.

# 42 శాతం రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి : పొనుగోటి రంగా



నల్గొండ, ఆగషు 29:స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పొనుగోటి రంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునగాల మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 31న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బీసీల యుద్ధభేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామంటే ఒప్పుకునేది లేదని, చట్టపరమైన హక్కుగా 42 శాతం రిజర్వే షన్లు ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లు పెంచే విషయంలో ఘర్షణ వైఖరి అవలంభించకుండా సాధించే మార్గాలు పరిశీలించాలన్నారు.

అఖిలపక్ష సమావేశాలు, బీసీ సంఘాల సమావేశాలు, న్యాయ నిపుణులు, అడ్వకేట్లతో సమావేశాలు జరిపి పరిష్కార మార్గాలు సాధించాలని కోరారు. బీసీల యుద్ధభేరికి వివిధ బీసీ సంఘాల నాయకులు, బీసీ ఉద్యమకారులు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలోజు మహేశ్ చారి, కోదాడ నియోజకవర్గం బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు వీరయ్య, మహేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# తెలుగు భాషకు పట్టని గొడుగు గిడుగు రామ్మూర్తి



నల్గొండ, ఆగష్టు 29: తెలుగు భాషకు పట్టని గొడుగు గిడుగు రామ్మూర్తి పంతులు అని నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం భీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.భిక్షమయ్య అన్నారు. శుక్రవారం భీమవరంలో పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యవహార భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. వ్యవహార భాషకు పట్టం కట్టిన మహనీయుడు గిడుగు అని కొనియాడారు. ఇలాంటి వారి వలనే మనం సరళమైన భాషను మాట్లాడగలుగుతున్నామన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

అమ్మ లాంటి కమ్మనైన మాతృభాషను మరువొద్దు అన్నారు. ప్రపంచంలోని ఏ భాషనైనా తనలో ఇముడ్చుకోగల శక్తి తెలుగు భాషకు మాత్రమే ఉందన్నారు. విద్యార్థులు మాతృ భాషపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాపోలు పరమేశ్, బత్తుల జానకి రెడ్డి, గుమ్మడవల్లి రమేశ్, జి.వెంకటేశ్వర్లు, కన్నె శివయ్య, లగిశెట్టి శ్రీధర్, మేడం శేఖర్, దోరేపల్లి నాగయ్య, జూనియర్ అసిస్టెంట్ సుమన్, అటెండర్ అహ్మద్ పాల్గొన్నారు.

# కెరీర్‌కు క్రీడలు దోహదం : కలెక్టర్ జితేశ్ వి పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 29 : చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని, క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని దేశానికి పేరు తెచ్చిన క్రీడాకారులు దేశంలో, రాష్ట్రంలో ఎంతో మంది ఉన్నారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుండి నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు శుక్రవారం పట్టణంలోని సింగరేణి స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ బహుమతులు అందజేసి మాట్లాడారు. ప్రతీ రోజు క్రీడల్లో సాధన చేస్తే ఏదో ఒక రోజు అద్భుతమైన విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు.

తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలను విజయవంతంగా నిర్వహి ంచిన కోచ్‌లను కలెక్టర్ అభినందిం చారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసులు, క్రీడల జిల్లా అధికారి పరంధామరెడ్డి, ఒలింపిక్ అసోసియే ఏషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ సెక్రెటరీ నరేశ్, జిల్లా బాక్సింగ్ ప్రెసిడెంట్ ఎర్ర కామేశ్, టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, బాడ్మింటన్ సెక్రెటరీ సావిత్రి, వివిధ క్రీడల కోచ్‌లు పాల్గొన్నారు.

# చండూరు మున్సిపల్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలి

నల్గొండ, ఆగష్టు 29:చండూరు మండలం అలాగే మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు బైక్ ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ, ఎమ్మార్వోకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా కోశాధికారి కాసాల జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల పరిధిలో సమస్యలు కుప్పలు తిప్పలుగా ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వివిధ గ్రామాలకు లింక్ రోడ్లు లేవని, డ్రైనేజీల సమస్య వల్ల దోమలు అధికంగా ఉండి ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడుతున్నారన్నారు. మండలంలోని సాగునీటి ప్రాజెక్టులైన శేషిలేటి ఫీడల్ ఛానల్, బెండాలమ్మ చెరువు, వెల్మకన్నే ఫీడల్ ఛానళ్ల పనులను పునరుద్ధరించాలన్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జి బొడిగే అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రభుత్వం నిర్మించిన పబ్లిక్ పార్కులకు తాళాలు వేసి నిరుపయోగంగా ఉంటున్నాయని, వాటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మున్సిపల్ అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, పందుల సత్యం గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కోమటి వీరేశం, జిల్లా కౌన్సిల్ సభ్యులు నకిరేకంటి లింగస్వామి, భూతరాజు శ్రీహరి, యువ మోర్చా రాష్ట్ర నాయకుడు పిన్నింటి నరేందర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బోడ ఆంజనేయులు, జిల్లా నాయకులు సముద్రాల వెంకన్న, తడకమల్ల శ్రీధర్ పాల్గొన్నారు.

# 4లైన్ల అంతర్రాష్ట్ర రైలు మార్గం

**-తెలంగాణ అభివృద్ధిలో గేమ్? ఛేంజర్!**
**-ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం**
**-173 కి.మీ. ప్రాజెక్టు రూ.5,102 కోట్ల వ్యయం**
**-తెలంగాణలో తొలి అంతర్రాష్ట్ర మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టు**

హైదరాబాద్, ఆగష్టు 29: తెలంగాణ రాష్ట్రం నుంచి మొదటి సారిగా నాలుగు లైన్ల అంతర్రాష్ట్ర రైలుమార్గం నిర్మాణం కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం జరిగిన కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ రూ.12, 318 కోట్ల విలువైన నాలుగు రైల్వే ప్రాజెక్టులను ఆమోదించింది. అందులో సికింద్రాబాద్ (సనత్‌నగర్) వాడి మధ్య మల్టీ ట్రాకింగ్ నిర్మించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.5,102 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టును ఐదేళ్ల కాలవ్యవధిలో పూర్తి చేయాలన్నది లక్ష్యం. 2026 కేంద్ర బడ్జెట్ లో ఇందుకోసం నిధులు కేటాయిస్తారు. ప్రస్తుతం ఈ మార్గంలో డబుల్ ట్రాక్ ఉంది. కేంద్రప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో మూడో, నాలుగో మార్గం (క్వాడ్రాప్లింగ్) పనులను చేపట్టనున్నారు. ఇది పూర్తయినట్లయితే రాష్ట్రం నుంచి ముంబయి వైపు రైళ్లు వడివడిగా పరుగులు పెట్టనున్నాయి. మరిన్ని కొత్త ట్రైన్లు కూడా వచ్చే అవకాశం ఉంది.

రద్దీ మార్గం : సికింద్రాబాద్ ) రైల్వే స్టేషన్ నుంచి మహారాష్ట్రలోని పుణెకు వెళ్లే శతాబ్ది ఎక్స్‌ప్రెస్ సహా ముంబయి వెళ్లే హుస్సేన్‌సాగర్, ఎల్‌టీటీ ముంబయి తదితర ట్రైన్లు వికారాబాద్, వాడి రూట్?లో రాకపోకలు సాగిస్తాయి. ఈ మార్గం నిత్యం 122 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియోతో(ప్రయాణికులు) కిటకిటలాడుతూ ఉంటుంది. ఈ మార్గంలో అనేక సిమెంటు పరిశ్రమలు ఉండగా వివిధ ప్రాంతాలకు వ్యవసాయ ఉత్పత్తులు, సిమెంటు, ఉక్కు రవాణా అవుతాయి. మొత్తం 173 కిలోమీటర్ల మేర క్వాడ్రాప్లింగ్ చేయనుండగా 49 కిలోమీటర్లు కర్ణాటకలో, 124 కి.మీ తెలంగాణ రాష్ట్రంలో ఉంది.

తెలంగాణ మౌలిక వసతుల అభివృద్ధి : సికింద్రాబాద్-వాడి మూడు, నాలుగో లైన్ల ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని, రైల్వేల్లో తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం సహకరిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

అంతరాయం లేకుండా రైలు ప్రయాణాలు : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని తాండూరు, ధారూర్, వికారాబాద్, బషీరాబాద్, మంతటి, రుక్మాపూరు, గోధుమగూడ రైల్వే స్టేషన్ల నుంచి ఇక అంతరాయం లేకుండా రైలు ప్రయాణాలు సాగనున్నాయి. దీనికితోడు సరకు రవాణా (గూడ్స్) రైళ్లు నిర్ణీత స్టాప్‌లో తప్ప ఎక్కడా ఆగవు. ప్రయాణికులు సరకు రవాణాకు ప్రయోజనం కలిగేవిధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

కర్ణాటక, తెలంగాణ, బిహార్, అసోం రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్‌తోపాటు సుదూర ప్రాంతాన్ని అనుసంధానించే రైల్ నెట్‌వర్క్‌ను నిర్మించడానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం కీలక నిర్ణయం తీసుకొంది. ఇందులో భాగంగానే సికింద్రాబాద్- వాడి మార్గంలో కొత్తగా 3, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది.

సిమెంటు కర్మాగారాలకు ప్రయోజనం : కొత్తగా మరో రెండు రైల్వేలైన్ల నిర్మాణంతో తాండూరు లోని సిమెంటు పరిశ్రమలకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

తాండూరు సమీపంలో సీసీఐ, ఇండియా సిమెంట్స్, పెన్నా సమీపంలోని కర్ణాటక రాష్ట్రంలో వికాట్‌సాగర్, చెట్టినాడు సిమెంటు కర్మాగారాలున్నాయి. వీటికి సికింద్రాబాద్- వాడి రూట్ నుంచే గూడ్స్ ట్రైన్ల ద్వారా బొగ్గు, క్లింకర్ తదితర ముడి సరకు దిగుమతి అవుతుంటుంది.

కర్మాగా రాల్లో ఉత్పత్తి అయిన సిమెంటు గూడ్సురైళ్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తారు. లైన్లు పెరగనుండడం వల్ల రవాణా మరింత వేగవంతం కానుంది. ప్రజల ప్రయాణాలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

ప్రస్తుతం రెండే లైన్లు : సికింద్రాబాద్- వాడి రూట్?లో ప్రస్తుతం రెండు లైన్లు మాత్రమే ఉన్నాయి.

ప్రయాణికుల ట్రైన్లు రాకపోకలు సాగించే వేళ గూడ్సు ట్రైన్లు గంటల తరబడి ఆగాల్సి వస్తోంది. కొన్నిసార్లు ప్రయాణికుల రైళ్లు కూడా స్టేషన్‌లోనే నిలిచిపోతున్నాయి. ఇలాంటి సమస్యల పరిష్కారానికి 1, 2వ లైన్లకు అదనంగా 3, 4 నిర్మించనున్నారు. రెండు లైన్లపై నుంచి ప్రయాణికులకు సంబంధించినవి, మరో 2 లైన్లపై గూడ్సు రైళ్లు రాకపోకలు సాగిస్తాయని రైల్వేశాఖ ఇంజినీరు తెలిపారు.

# సత్ప్రవర్తనతో ఆదర్శవంతంగా జీవించాలి : ఎస్పీ నరసింహ

**– రెండోసారి నేరం చేస్తే పీడీ యాక్ట్**
**– సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
**–అన్ని మతాల పండుగలను పరస్పర గౌరవంతో జరుపుకోవాలి**




నల్గొండ, ఆగష్టు 29: కోదాడ సబ్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లు, గంజాయి సేవించేవారు, అమ్మకం, రవాణాదారులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ప్రతి ఒక్కరు తమ పాత అలవాట్లను మానుకుని సత్ప్రవర్తనతో ఆదర్శంగా జీవించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ హితవు పలికారు. శుక్రవారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో కోదాడ సబ్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువతకు నిర్వహించిన కౌన్సిలింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాత్కాలిక సుఖం కోసం చెడు అలవాట్లకు లోనై కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతూ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. తెలిసి తెలియక చేసిన తప్పులను సరిదిద్దేందుకు తామిచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెండోసారి నేరం చేస్తే అనివార్యంగా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సమాజ శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. మాదకద్రవ్యాలకు అలవాటై భార్యా పిల్లలను వదిలేస్తే వారి బతుకులు ఎలా ఉంటాయో అవగతం చేసుకుని మంచి పౌరులుగా మారాలని ఉదాహరణలతో వివరించారు. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఆధార్ కార్డు నంబర్ గాని బ్యాంక్ ఎకౌంట్ నంబర్ గాని ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దన్నారు. తెల్లారేకల్లా లక్షల రూపాయలు సంపాదించుకోవచ్చని ఆన్‌లైన్‌లో వ్యాపారం చేసి ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలను ఆయన వివరిస్తూ వాటికి దూరంగా ఉండాలన్నారు. లక్కీ డ్రా అలాంటి మోసాలపై అప్రమత్తగా ఉండాలన్నారు.

ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని పోలీసేనని, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. వినాయక చవితి, దసరా, దీపావళితో పాటు పాటు అన్ని మతాలకు చెందిన పండుగలను వివాదాలకు తావు లేకుండా పరస్పర గౌరవంతో జరుపుకోవాలని సూచించారు. అవగాహన సదస్సుకు అధ్యక్షత వహించిన కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి భవిష్యత్‌లో నేరాలు చేయమని, మంచి ప్రవర్తన కలిగి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐలు చరమంద రాజు, ప్రతాప లింగం, శివ శంకర్ నాయక్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# సోమశిలకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్.. ఘనస్వాగతం పలికిన బీఆర్ఎస్ నేతలు



హైదరాబాద్, ఆగష్టు 29:: మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు సోమశిలలో ఘన స్వాగతం లభించింది. అలాగే తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయి కుమార్ యాదవ్‌కు బీఆర్ఎస్ నేతలు పూలమాలలు, శాలువాలతో సన్మానం చేసి ఘన స్వాగతం పలికారు. శ్రీనివాస్ యాదవ్ తన వియ్యంకుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మూల రాజ్ కుమార్ గౌడ్ ఇటీవల మరణించగా, శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిలలో గల కృష్ణా నదిలో అస్థికలు కలిపేందుకు వచ్చారు. వీఐపీ ఘాట్ వద్ద వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టూరిజం లాంచీలో సప్త నదులు కలిసే సంగమం వద్ద అస్థికలను గంగాజలంలో కలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో ప్రత్యేకంగా చర్చించారు. కొల్లాపూర్ ప్రాంతానికి గతంలో తాను వచ్చినట్లు గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల పట్ల చిత్తశుద్ధి అవసరమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు పార్లమెంట్‌లో పెట్టాలన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కొల్లాపూర్ రావడంతో బీఆర్ఎస్ స్థానిక నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాష్ట్రంలో బీసీల గొంతుకగా తలసాని శ్రీనివాస్ యాదవ్ ఉన్నారని, బీసీ రిజర్వేషన్ల పట్ల తలసాని శ్రీనివాస్ యాదవ్ లేవనెత్తిన అంశాలు రాష్ట్రంలోని బీసీలను చైతన్యం చేశాయని ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దూరెడ్డి రఘువర్ధన్ రెడ్డి, స్థానిక బిఆర్ఎస్ నేతలు సింగిల్ విండో చైర్మన్ విజయరామరావు, మాజీ ఎంపీపీ నరేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కాటం జంబులయ్య, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సాంబశివుడు యాదవ్, పెంట్లవెల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, రాజేష్, సురేంద్ర గౌడ్, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, యాదవ సంఘాల నాయకులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు.

# 30న జాబ్ మేళా..

అమరావతి, ఆగష్టు 29:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఈ నెల 30న శనివారం ఉదయం 09:00 గంటలకు గుడివాడలోని ఎఁఔకౌ అనీశ్రీశ్రీవణవలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ తెలిపారు.

ఈ జాబ్ మేళాలో, ఎఫ్టానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెటిరో ల్యాబ్స్, జోయా లుక్కాస్ జ్యూవెలరీ, మెకనర్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, బిగ్ సి మొబైల్స్, జేసీ గ్రాఫిక్స్ లిమిటెడ్, కురాకు ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్, క్వెస్ కార్ప్ లిమిటెడ్, మెడ్ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ర్యాపిడో తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని ఉపాధి అధికారి/ డిజిగ్నెటెడ్ ఆఫీసర్ డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ తెలిపారు.

ఈ కంపెనీలలోని ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బీ.టెక్, బీ.ఫార్మసీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల లోపు యువత అర్హులని, ఎంపిక అయిన వారికి వేతనం, ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని, ఆగష్టు 30న నిర్వహించే జాబ్ మేళాకు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు.

ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/ user-registration లింక్ లో తప్పనిసరిగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావడంతోపాటు, సదరు జాబ్ మేళాకు రెజ్యూమ్ లు, బయోడేటాలు ఆధార్, ఆధార్ కు లింక్ చేసిన ఫోన్ నంబర్, ఖంఔ , సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని తెలిపారు.

మరిన్ని వివరాలకు 96666 54641, 98488 19682 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి నిధులు ఖర్చు చేయాలి : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నల్గొండ, ఆగషు 29: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నకిరేకల్ నియోజకవర్గానికి మంజూరైన సుమారు రూ.150 కోట్ల నిధులను రాజకీయాలకు అతీతంగా ఖర్చు చేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం కట్టంగూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎక్కడైతే మంజూరైన నిధులు మార్చకుండా అక్కడే ఖర్చు చేసి పనులను పూర్తి చేయాలన్నారు. కేసీఆర్ గ్రామ పంచాయతీలకు అందజేసిన ట్రాక్టర్లు వినియోగంలో లేకుండా పోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలో అమృత పథకం కింద రూ.5 కోట్లు మంజూరు చేయించానని, ఆ పనులు ఇప్పటికి మొదలు కాలేదన్నారు.

చంద్రబాబు కనుసన్నల్లో రేవంత్ పాలన

గతంలో వర్షాలు వచ్చినప్పుడు కేసీఆర్ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బీఆర్ఎస్ శ్రేణుల ను భాగస్వాములను చేసి సహాయక చర్యలు చేపట్టేవారన్నారు. గత వారం రోజుల నుండి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే సహాయ చర్యలు చేపట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగిపోతే కాళేశ్వరం కాదు కూళేశ్వరం అంటూ సీఎం కుంటి సాకులు చెబుతూ చంద్రబాబు కనుసన్నల్లో రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా అడ్డుకున్నాడని ఆరోపించారు. నియోజకవర్గంలో రోడ్లు గుంతలు పడి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి పట్టింపులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇవ్వడంతో వారి మీద నమ్మకం పెట్టుకుని ప్రజలు ఓట్లు వేశారని, ఈ రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో చేసిన అభివృద్ధి చెప్పాలని ప్రశ్నించారు. కట్టంగూర్ పెద్దవాగుపై రెండు వంతెనల నిర్మాణాలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.4 కోట్లు మంజూరు చేయించానని, ఇంత వరకు పనులు మొదలు కాలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రజా సమస్యలు పరిష్కరించి గతంలో చేసిన పనులకు పెండింగ్ బిల్లులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన వ్యక్తులనే గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ్మా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చౌగోని జనార్దన్, నాయకులు బెల్లి సుధాకర్, గుండగోని రాములు, దాసరి సంజయ్ కుమార్, నోముల వెంకటేశ్వర్లు, నలమాద సైదులు, మేడి రాములు. మునుగోటి ఉత్తరయ్య, జిల్లా యాదయ్య, పోగుల నర్సింహ్మా, పోగుల అంజయ్య, మాతంగి సైదులు, రాచకొండ యాదయ్య, యర్కల మల్లేశ్, అంతటి అంజయ్య పాల్గొన్నారు.

# అధికారులపై తిరగబడ్డ ఎత్తి పోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులు

## - ఉద్రిక్తత.. తోపులాటలో సొమ్మసిల్లిపోయిన మహిళా రైతు



నారాయణపేట ఆగస్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జిల్లా కొడంగల్-నారాయణపేట ఎత్తి పోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులు అధికారులపై తిరగబడ్డారు . దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తోపులాటలో మహిళా రైతు సొమ్మసిల్లిపోవడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు సర్వే చేయుడానికి అధికారులు రావడంతో రైతులంతా ఏకమై అధికారులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పై అధికారులు వందల మంది పోలీసులను అక్కడికి పంపించడంతో పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. బాపనగుట్ట రైతులతో పాటు మహిళ రైతులు కూడా వచ్చి రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సమయంలో గ్రామంలో మల్లమ్మ అనే మహిళ రైతు స్పృహతప్పి పడిపోవడంతో ఆమెను ప్రథమ చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. భీమప్ప అనే రైతు సర్వే కోసం వచ్చిన అధికారి కాళ్లు మొక్కుతా సార్.. మాకు చాలినంత డబ్బులు ఇస్తామని చెప్పిన తర్వాతనే సర్వే చేయాలని కాళ్లపై పడి వేడుకున్నాడు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన రాస్తారోకో పది గంటల వరకు కొనసాగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అక్కడికి వచ్చిన అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన విధానం ప్రకారమే చేస్తున్నామని ఇప్పటికే డబ్బులు వచ్చిన రైతులకు కూడా ప్రభుత్వం పెంచి ఇస్తే అది కూడా మిగతా రైతులు కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ మొగులప్ప మాట్లాడుతూ రైతుకు సరైన ధర నిర్ణయించిన తరువాతనే సర్వే చేపట్టాలని కోరడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# మల్లాపూర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

హైదరాబాద్, ఆగష్టు 29: మల్లాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మెట్ పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతి రెడ్డి, పీహెచ్ సీ డాక్టర్ వాహిని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మెట్ పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాస్ రావు, కార్యదర్శి సురకంటి జైపాల్ రెడ్డి, కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూంద్ర శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

-అడ్వెంచర్ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించేలా ప్రభుత్వంతో మాట్లాడతా

- నేషనల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ కార్యక్రమంలో మధుయాష్కీ గౌడ్

-అడ్వెంచర్ క్రీడాకారులకు అవార్డుల ప్రధానం




హైదరాబాద్ ఆగష్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ గారు పేర్కొన్నారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలను శుక్రవారం హయత్ నగర్ లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మధుయాష్కీ గౌడ్ గారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తూ క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అధిక నిధులు ఖర్చు పెడుతుందని వివరించారు. గత బి ఆర్ ఎస్ పాలనలో క్రీడలు, క్రీడాకారులను నిర్లక్ష్యానికి గురి చేశారని పేర్కొన్నారు. ఎవరెస్ట్ ఎక్కిన యువకుడు తుకారాంకు గత ప్రభుత్వం ప్రోత్సాహంకం ఇవ్వకుండా అవమానం చేసిందని, అతను ఆత్మహత్యాయత్నాన్ని కూడా ప్రయత్నించడం బాధాకరమన్నారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో క్రీడాకారులకు అన్యాయం జరగదు అన్నారు. అడ్వెంచర్ క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేలా క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గారితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. యువతను క్రీడలను వైపు మళ్లించడం ద్వారా .. మత్తు పానీయాలు లాంటి చెడు వ్యసనాలకు దూరం చేయవచ్చునని పేర్కొన్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం క్రీడా కేంద్రాల పేర్లు మార్చింది తప్ప నిధులను కేటాయించలేదని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ తో కలిసి గ్రామీణ స్థాయిలో స్పోర్ట్స్ స్టేడియాలు, క్రీడా పరికరాలు కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అడ్వెంచర్ క్రీడలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అవార్డులను ప్రధానం చేసి అభినందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ టి. ఐజయ్య, అబ్దుల్లాపూర్మెట్ ఎంపీడీవో శ్రీవాణి, అడ్వెంచర్ క్లబ్ ఆఫ్ తెలంగాణ సెక్రెటరీ రంగారావు, మేరా యువ భారత్ జిల్లా అకౌంట్ ఆఫీసర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన విప్లవ వీరుడు సర్వాయి పాపన్నగౌడ్ : ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

హైదరాబాద్, ఆగష్టు 29:బహుజన విప్లవ వీరుడు సర్వాయ్ పాపన్నగౌడని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మండలం నానాజీపూర్ గ్రామంలో సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన విప్లవ వీరుడు సర్వాయ్ పాపన్నగౌడ్‌ని వివరించారు. అనగారిన వర్గాలు, బహుజనల ఐక్యత కోసం పోరాడి గోల్కొండ కోటను జయించిన ధీరుడని కొనియాడారు.

నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పని చేశారని చెప్పారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని గ్రామాలలో ఐక్యత చాటని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటసీ తన్విరాజు, చంద్రారెడ్డి, వెంకటేశ్ గౌడ్,మాజీ సర్పంచ్‌లు దండుఇస్తారి, రమేష్‌యాదవ్,నాయకులు రవీందం గౌడ్,శ్రీకాంత్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, మైలారంభిక్షపతి,ఎస్ శ్రీనివాస్, గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు నారాయణగౌడ్, ఉపాధ్యాక్షుడు జనార్ధన్‌గౌడ్, కార్యదర్శి విఠలయ్యగౌడ్, లింగంగౌడ్, రామస్వామిగౌడ్, శ్రీరాములు, జగదీష్‌గౌడ్, లక్ష్మయ్య, సిద్దేశ్వర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# క్రీడలతో పరిపూర్ణ మూర్తిమత్వం

## - ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



నల్గొండ, ఆగష్టు 29:నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 3 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ పరుగులో 70 మంది విద్యార్థులు పాలుపంచుకోగా గెలుపొందిన వారికి వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్‌లో స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ హరీశ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వీసీ, జిల్లా స్పోర్ట్స్ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ మాట్లాడారు.


ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో ఉన్నత ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు పరిపూర్ణ మూర్తిమత్వాన్ని పెంపొందించే సాధనాలన్నారు. ఎంజీయూలో క్రీడలకు సైతం రెండు క్రెడిట్లను అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మొబైల్ వాడకం కన్నా దేహ దారుఢ్యం, మానసిక ఉల్లాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించి సంఘ జీవనానికి, సహకారాలకు పునాది లాంటి క్రీడలపై దృష్టి సారించాలని ఆకాక్షించారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ మాట్లాడుతూ.. ఉత్తమ సదుపాయాలు కలిగిన ఎంజీయూలో జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయాలని, అందుకు తగిన శిక్షణలు, ఖేలో ఇండియా వంటి క్రీడలను నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు.

జాతి నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, వారి చలనశీలత, బుద్ధి కుశలతకు క్రీడలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరానికి స్పోర్ట్స్ క్యాలెండర్, ఎంజీయూలో మొట్టమొదటిసారిగా వివిధ అంశాల్లో స్పోర్ట్స్ క్లబ్స్ ఏర్పాటుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.రామావత్ మురళి, డా. వై.శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్ శివశంకర్ పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీనరసింహుని జన్మ నక్షత్రం "స్వాతి" పూజలు

## -యాదగిరీశా...మము బ్రోవుమయ్యా

## -నృసింహ నామస్మరణతో మార్మోగిన గిరిప్రదక్షిణ



యాదగిరిగుట్ట, ఆగస్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ ప్రజల ఇలవేల్పు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా శుక్రవారం నృసింహుని నామస్మరణతో, భజనలతో ,కీర్తనలతో యాదగిరి కొండ మార్మోగింది. ఉదయం తెల్లవారుజామున వేలాది మంది భక్తులు తండోపతండాలుగా గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. తొలుత వైకుంఠ ద్వారం వద్ద శ్రీ స్వామివారి పాదాల వద్ద పూజలు చేసి.. ఆ తర్వాత కొండ చుట్టూ ఎంతో భక్తి భావంతో గిరి ప్రదక్షణ కొనసాగించారు. ఆ తర్వాత కొండపైకి వెళ్లి ఈ స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక భక్తులే కాదు రాష్ట్ర నలుమూలల నుండి ప్రత్యేకంగా వచ్చి గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. శుక్రవారం యాదగిరి కొండ ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు పులకించిపోయారు. గిరిప్రదక్షణలో పాల్గొంటే దోషాలు తొలగుతాయని, కోరిన కోర్కెలు తీరుతాయని, శ్రీ స్వామివారి చల్లని చూపు తమ కుటుంబ సభ్యులపై ఉంటుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆలయంలో శత ఘటాభిషేకం

శ్రీ స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా శతఘటాభిషేకం నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి ప్రత్యేకంగా విచ్చేసి గిరిప్రదక్షిణలో పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకొని భక్తులు తరించారు .శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా గిరిప్రదక్షిణ చేయుడం ...శ్రీ స్వామివారిని దర్శించుకొని పూజలు చేయడం భక్తి...ముక్తి దాయకమని రాష్ట్ర ఐవిఎఫ్ తెలంగాణ ధార్మిక పరిషత్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి అన్నారు . ఆయనతోపాటు వారి భక్తబృందం, అయ్యప్ప గురుస్వాములు,పెండెం శ్రీనివాస్, పెద్దగాని శ్రీనివాస్ గౌడ్, వల్లకాటి సురేష్, గోవర్ధన్,కృష్ణ గౌడ్ ,శ్రీరామ్ మూర్తి, నర్సింహా,అంజయ్య, లావణ్య,లెంకల పల్లి శ్రీనివాస్,బిక్షపతి గౌడ్,శ్రీకాంత్, మల్లారెడ్డి, సత్తిరెడ్డి తోపాటు వేలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొని తరించారు.

# ఎంఈడీ కోర్సు పరీక్షా ఫీజు స్వీకరణ

హైదరాబాద్, ఆగష్టు 29: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును వచ్చే నెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 15వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలను లేవనెత్తుతాం : ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



సూర్యాపేట, ఆగష్టు 29: అసెంబ్లీ సమావేశంలో తమ సమస్యలను లేవనెత్తాలని ప్రజలు బీఆర్‌ఎస్ తలుపు తడుతున్నారు అని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తెలిపారు. తప్పకుండా ప్రజా సమస్యలను అసెంబ్లీలో లెవనేత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఉద్యోగులు భృతి కోసం, నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం, విద్యార్థినులు స్కూటీ కోసం, రైతులు రుణమాఫీ, రైతు భరోసా, యూరియా, కరెంటు కోతలపై మమ్మల్ని అడగమని అంటున్నారు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వరదలపై ప్రభుత్వానికి సోయి లేదు. సీఎం పాత పద్ధతుల్లో రోత మాటలు.. మంత్రులకు రివ్యూ చేయాలనే సోయి లేదు. గోదావరి, కృష్ణాలో వందలాది టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తుందని జగదీశ్ రెడ్డి తెలిపారు.

జిల్లా కేంద్రంలోని ఉదయసముద్రంలో నీరు లేదు.. జిల్లా మంత్రి కోమటిరెడ్డికి సోయి లేదు. ఓ వైపు వర్షాలు, మరోవైపు యూరియా కోసం రైతులు పడిగాపులు. కాళేశ్వరం నివేదిక అసెంబ్లీలో పెడితే మాకేం ఇబ్బంది లేదు. అసలు నివేదికను బయట పెట్టాలని మేము డిమాండ్ చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

స్థానిక సంస్థల పేరుతో కాంగ్రెస్ మోసం బయట పడింది. మరో డ్రామాకు తెర తీస్తుంది. హైకోర్టు మూడు నెలల టైమ్ ఇస్తే, రెండు నెలలు నిద్రపోయి, ఇప్పుడు హడావుడి చేస్తుంది. ఎన్నికల కమిషన్ దుర్మార్గంగా వ్యవహరిస్తుంది. ఓ వైపు వర్షాలు, వరదలు వస్తుంటే సమగ్రంగా లేని ఓటర్ లిస్టులు పెట్టి ప్రజల్ని గందరగోళానికి గురి చేస్తున్నారు. అన్ని ఓటర్ లిస్టులను గ్రామాల్లో బహిరంగ పర్చాలి. అందరి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి అని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# పరవళ్ళు తొక్కుతున్న మూలవాగు

## -గంగమ్మ తల్లికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని బతుకమ్మ తెప్ప వద్ద ములవాగులో గంగమ్మ తల్లికి చీర కుంకుమ పసుపుతో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ మూల వాగు వద్ద పరవళ్ళు తొక్కుతున్న గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని గంగమ్మ తల్లిని వేడుకున్నామన్నారు. సృష్టిలో నీటి కున్న ప్రాముఖ్యత నిర్వచించలేనిదనీ, రాష్ట్రంలోని ప్రాజెక్టులన్ని జలకలతో కలకలడుతున్నాయన్నారు. భారీ వర్షాలు పడిన ఆనాడు కాంగ్రెస్ పార్టీ నిర్మించిన నాగార్జునసాగర్ శ్రీ రామ్ సాగర్ కడెం వంటి అనేక ప్రాజెక్టు చెక్కుచెదరకుండా ఉన్నాయనీ, లక్ష కోట్లతో నిర్మించామని గొప్పలు చెబుతున్న కాళేశ్వరం కృంగిపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మొదటి నుండి ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను కడుతుందన్నారు. నర్మాల వద్ద పలువరు వరదలో చిక్కుకుంటే కేటీఆర్ వచ్చి రాజకీయాల గురించి మాట్లాడారని, వరదల్లో చిక్కుకున్న వారికి సహాయం చేయుడం మరిచిపోయి కేటీఆర్ రాజకీయాలు మాట్లాడరని అన్నారు. కేటీఆర్ వచ్చేటప్పుడికే హెలికాప్టర్ లు వచ్చి బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారనీ, సందర్భం కాకున్నా కేటీఆర్ బురద రాజకీయాలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేశారని, చక్రవర్తిల రాష్ట్రాన్ని ఫామ్ హౌస్ నుండి పరిపాలించింది మీ నాన్న కాదా అని ప్రశ్నించారు. రాష్టాన్ని అప్పుల కుప్పలుగా మార్చిన మీరా మా గురుంచి మాట్లాడేదని, వరద పరిస్థితి చూస్తుంటే కేటీఆర్ వైఫల్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంద న్నారు. పది సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కనీసం బ్రిడ్జిలను కూడా నిర్మించలేకపోయారని, వరదలకు మీ అసమర్థత కారణం కాదా ప్రశ్నించారు.

నా చర్మం వలచి సిరిసిల్ల ప్రజలకు చెప్పులు కుట్టిస్తానని పెద్ద పెద్ద మాటలు మాట్లాడి కనీసం బ్రిడ్జిలు కూడా కట్టలేకపోయాడనీ, ప్రకృతి వైపరీత్యం వల్ల వరదలు వస్తే సహాయం చేయవలసింది పోయి అక్కడ కూడా మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నార న్నారు. మీ హయాంలో ప్రజలు తల్లడితే పట్టించుకోలేదని,రాష్ట్రం చల్లగా ఉండాలని కోరుకోవాలి కానీ రాష్ట్ర నాశనం కోరుకుంటున్నారు బిఆర్ఎస్ వారు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కాలేశ్వరం ప్రాజెక్టుపై చర్చిస్తున్నామనీ, గుమ్మడికాయ దొంగ ఎవరంటే భుజాలు తాడుముకున్నట్లుగా కేసీఆర్ కేటీఆర్ కోర్టుకు వెళ్లి కాళేశ్వరం విచారణపై స్టే ఇవ్వాలని అడిగారని, మీరు తప్పు చేయనప్పుడు మీకు ఎందుకు భయం. అన్నారు. దమ్మంటే అసెంబ్లీకి వచ్చి కాలేశ్వరం పై చర్చిలో పాల్గొనాలని, బీసీ ఘోస్ నివేదికను కూడా తప్పుపడుతున్నారన్నారు. కెసిఆర్ హరీష్ రావు ను పిసి గోస్ కమిషన్ ఒక్కొక్కరిగా విచారించిందని, బిఆరెస్ పరిపాలనలో వారి చేసినవి అన్ని స్కాములే అన్నారు. కాలేశ్వరం గోర్లు బర్లు చాపలు వేటిని వదలకుండా అన్ని స్కాం చేశారని గుర్తు చేశారు.

# నేషనల్ ఓపెన్ కరాటే పోటీల్లో కిడ్స్ కాన్వెంట్ విద్యార్థికి మెడల్స్




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29:(నేటినిజం ప్రతినిధి): బెంగుళూరులోని సురాన కాలేజ్ పెన్యలో ఆగస్ట్ 28 ఆదివారం జరిగిన ఆల్ ఇండియా నేషనల్ లేవల్ ఓపెన్ కరాటే చాంపియన్షిప్ లో వేములవాడ పట్టణం భగవంతరావు నగర్ చెందిన ఉప్పుల పవన్ రాజ్ కిడ్స్ కాన్వెంట్ స్కూల్10వ తరగతి రెండు చాంపియన్షిప్ కప్ లు గెలుపొందాడు. 6 గోల్డ్ మెడల్స్, 3 చాంపియన్షిప్ లు గెలుపొందాడు. ఈ సందర్భంగా కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ దరక్షన్ వసూపియా విద్యార్థిని అభినందించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వేములవాడ లో జరిగిన మోడీ సైకిల్ బండి కార్యక్రమంలో ఉప్పుల పవన్ రాజ్ ను బెస్ట్ ఆఫ్ లక్ చెప్పి అభినందించారు.

# మధిరలో ఘనంగా జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం

ఖమ్మం, ఆగష్టు 29: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా హెచ్ఎం దివి సాయి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. తెలుగు భాష ఔన్నత్యం, ప్రశస్థి, తెలుగు సాహిత్యాన్ని వ్యవహారిక భాషలో రాయడానికి గిడుగు రామ్మూర్తి విశేష కృషి చేసినట్లు కొనియాడారు.

అలాగే భారతదేశం తరఫున వరుసగా 3 ఒలింపిక్ క్రీడల్లో బంగారు పతకాలు సాధించి పెట్టి, భారత హాకీ స్వర్ణ యుగానికి ధ్యాన్ చంద్ నాంది పలికారన్నారు. మహనీయుల కృషి, పట్టుదలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులంతా ధ్యాన్ చంద్‌ని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో తద్వారా జీవితంలో ఉన్నత స్థాయిని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శైలజ, ఎం.మాధవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# "కాలం కన్న ముందు నడిచిన మేధావి సురవరం ప్రతాపరెడ్డి" పుస్తకావిష్కరణ



హైదరాబాద్, ఆగష్టు 29:ప్రసిద్ధ సంపాదకులు, పరిశోధకులు, రచయిత సురవరం ప్రతాపరెడ్డిని నేటితరం ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య కల్యాణ మండపంలో ఆగష్టు 25 ననిర్వహించిన " కాలం కన్న ముందు నడిచిన మేధావి సురవరం ప్రతాపరెడ్డి " పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా సంపాదకుడిగా, పరిశోధకుడిగా, రచయితగా, పండితుడిగా, క్రియాశీల ఉద్యమకారుడిగా సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ అనన్య సామాన్యమెనదన్నారు. గోల్కొండ పత్రిక ద్వారా ఆనాటి ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వైతాళికుడన్నారు. వందేళ్లలో పూర్తి చేయాల్సిన పనులను 50 ఏళ్ల జీవితంలో పూర్తి చేసి తరగని ముందుచూపుతో కాలంకంటే ముందు నడిచిన మేధావిగా సురవరం ప్రసిద్ధికెక్కారని చెప్పారు. ప్రతాపరెడ్డి లాంటి మహోన్నతుడు భవిష్యత్ లో పుట్టడం అసాధ్యమన్నారు. వనపర్తిలో సురవరం, ప్రజావైద్యుడు డా.మాధవరెడ్డి విగ్రహాలను వచ్చే ఏడాది ఏర్పాటు చేస్తామన్నారు. వనపర్తి నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన తన అన్న మాధవరెడ్డికి సురవరం ప్రతాపరెడ్డి పుస్తకాన్ని అంకితం చేయడం గర్వకారణవన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షులు డా.గంటా జలంధర్ రెడ్డి డా.జిల్లెల చిన్నారెడ్డిని, డా. జిల్లెల మాధవరెడ్డి కుమార్తె డా.జిల్లెల శిల్ప అనురాగ్ రెడ్డి ని శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు సుర వరం ప్రతాపరెడ్డి, జిల్లెల మాధవరెడ్డి చిత్రపటాలకు పూలమాలలతో ఘనంగా నివాళి అర్పించారు. సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు డాక్టర్ కృష్ణవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతాపరెడ్డికి రావాల్సిన స్థాయిలో గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజానికి పరితపించిన సురవరం రచనలు, కృషి సామాన్యుల దరికి చేరాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పుస్తక సంపాదకులు ఆచార్య గంటా జలంధర్ రెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి నిజాం కాలంలోనే నిజాంకు వ్యతిరేకంగా రచనలు చేసిన ధైర్యవంతుడన్నారు. 354 మంది కవులతో గోల్కొండ కవుల సంచికను వెలువరించిన గొప్ప సాహితీవేత్త అని కీర్తించారు. వనపర్తి తొలి శాసనసభ్యులైన సురవరం ప్రతాపరెడ్డి ఎన్నో విలువైన ప్రామాణిక గ్రంథాలను రచించారన్నారు. ఆయన పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం ఒక రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సభాధ్యక్షులు డా. పోరెడ్డి రంగయ్య మాట్లాడుతూ సురవరం ఒక వ్యక్తి కాదని, ఒక శక్తి అని పేర్కొన్నారు. ఒంటిచేత్తో ఎవరూ చేయలేని పనులను చేసిన ధీశాలి అని కొనియాడారు. రెండవ ప్రపంచ యుద్ధంలో వనపర్తి సైనికులు పాల్గొని ప్రధాన భూమిక పోషించారని, ఈ వనపర్తి ప్రాంతం చారిత్రకంగా విశేషమైనదని తెలంగాణ చరిత్ర అధ్యయన కేంద్రం చైర్మన్ కెప్టెన్ డా. లింగాల పాండురంగారెడ్డి పేర్కొన్నారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ డా. దిలీప్ రెడ్డి మాట్లాడుతూ నిజాం ఆంధ్ర మహాసభలకు తొలి అధ్యక్షత వహించిన ఘనత సురవరందేనన్నారు. పోరుగడ్డతో పాటు కలంగడ్డగా వనపర్తి విశేష ప్రాధాన్యత కల్గిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తల్లి రూపశిల్పి రమణారెడ్డి, ఆచార్య సూరారవు భిక్షం, సాహితి కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, కార్యక్రమ సమన్వయకర్త డా.భీంపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిది రెట్లు ఎక్కువ విషపూరిత కణాలు గల గాలిని ప్రతి భారతీయుడు

### తగ్గిపోతున్న భారతీయుల సగటు ఆయుష్షు 3.5 సంవత్సరాలు
### –ఢిల్లీ నగరంలో ప్రతి ఒక్కరూ 8.2 సంవత్సరాలు నష్టపోతారు
### –ఆంధ్ర ప్రదేశ్‌లో 2.1 సంవత్సరాలు, తెలంగాణలో 2.4 సంవత్సరాలు
### –ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడి

న్యూఢిల్లీ ఆగస్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సిఫారసు చేసిన సురక్షిత గాలి నాణ్యత స్థాయికి ఎనిమిది రెట్లు ఎక్కువ విషపూరిత కణాలు గల గాలిని ప్రతి భారతీయుడు పీలుస్తున్నాడు. ఇంత ఎక్కువ స్థాయిలో విషపూరిత కణాలను పీల్చుకోవడం వల్ల భారతీయుల సగటు ఆయుష్షు 3.5 సంవత్సరాలు తగ్గిపోతున్నది. అత్యధిక కాలుష్యం గల ఢిల్లీ నగరంలో ప్రతి ఒక్కరూ 8.2 సంవత్సరాలు నష్టపోతారు. ఉత్తరాది కన్నా దక్షిణాది కొంత వరకు మెరుగైన స్థితిలో ఉంది.డబ్ల్యూహెచ్‌వో సిఫారసు చేసిన స్థాయికి గాలి కాలుష్యాన్ని తగ్గించగలిగితే, కర్ణాటకలో ప్రతి ఒక్కరూ అదనంగా 1.6 సంవత్సరాలు, ఆంధ్ర ప్రదేశ్‌లో 2.1 సంవత్సరాలు, తెలంగాణలో 2.4 సంవత్సరాలు, తమిళనాడులో 1.7 సంవత్సరాలు, కేరళలో 1.3 సంవత్సరాలు జీవించగలుగుతారు. చికాగో విశ్వవిద్యాలయం నేతృత్వంలోని గ్లోబల్ టీమ్ రూపొందించిన ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ ఈ వివరాలను వెల్లడించింది. 2023 నాటి పరిస్థితులను విశ్లేషించి ఈ నివేదికను తయారు చేశారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో శ్రీ మహాగణపతికి మహా నైవేద్యం



కరీంనగర్, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి) గణనాధుని పూజ వలన సకల శుభాలతో పాటు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు డాక్టర్ వి.వనజా నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో శ్రీ విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలు భాగంగా వేడుకగా ఏర్పాటు చేసినటువంటి మహా నైవేద్య మహోత్సవ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా హాజరై స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాధునికి వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో స్వామివారికి వివిధ రకాల ద్రవ్యాలతో వివిధ రకాల పూజలను చాలా గొప్పగా వేడుకగా, కుటుంబ సభ్యుల ఆనందోత్సవాల నడుమ చేయడం ఒక గొప్ప సాంప్రదాయంగా వస్తున్నదని వారు గుర్తు చేశారు. స్వామివారిని అన్నివేళల్లో కొలిచిన వారికి అన్ని వేళల్లో శుభాలతో పాటు విజయాలు కూడా సిద్ధిస్తాయని వారు చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెదలాలని, ప్రేమ ఆప్యాయతలను పంచాలని వారు సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు సుమారు 120 రకాల నైవేద్యాలను స్వామివారికి మహా నైవేద్యంగా సమర్పించారు. స్వామి వారికి ప్రీతికరమైనటువంటి మోదకాలు, ఉండ్రాళ్ళు, పాయసం, చక్కెర పొంగలి, పులిహోర, జిలేబి, బాదుషా, శనిగలు, గరిజెలు, మక్క గారెలు, పూరి, చపాతి, చకినాలు, అప్పాలు, వివిధ రకాల పండ్లు, పండ్ల రసాలు, చాక్లెట్లు తదితర ప్రసాదాలను స్వామి వారికి సమర్పించడం జరిగిందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే -రాజీవ్ నగర్ మినీ స్టేడియంలో క్రీడా పోటీలు




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా రాజీవ్ నగర్ మినీ స్టేడియంలో మేజర్ ధ్యాన్చంద్ జన్మ దినమును పురస్కరించుకొని నేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కబడ్డీ, వాలీబాల్, ఆర్చేరి క్రీడా పోటీలను క్రీడల యందు ఆసక్తి గల బాల బాలికలకు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ ద్వితీయ బహుమతులు ఏ రాందాస్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చేతుల మీదుగా, పిడి సురేష్ గారు చేతుల మీదుగా బహుకరించారు. ఇట్టి కార్యక్రమానికి దాదాపు 100 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈ కార్యక్రమజిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయ సిబ్బంది, వాలీబాల్ అకాడమి కోచ్లు అలాగే ఖేలో ఇండియా సెంటర్ కాబట్టి కోచ్, ఇతర స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# రష్యాకు మద్దతిచ్చి భారత్ మూల్యం చెల్లించుకుంటోంది

### –అమెరికా సెనేటర్ లిండ్సే గ్రాహం సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్ ఆగష్టు 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అమెరికా సెనేటర్ లిండ్సే గ్రాహం సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యాకు మద్దతిచ్చి భారత్ మూల్యం చెల్లించుకుంటోందని వ్యాఖ్యానించారు. మిగతా దేశాలు కూడా త్వరలోనే భారీ మూల్యం చెల్లించుకుంటాయని హెచ్చరించారు.రష్యా నుంచి డిస్కౌంట్‌పై చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించినట్లు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవలే తెలిపారు. ఈ వ్యవహారంపై అమెరికా సెనేటర్ లిండ్సే గ్రాహం తాజాగా స్పందించారు. ఈ మేరకు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలకు కీలక హెచ్చరికలు చేశారు.భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేసి ఉక్రెయిన్‌పై మాస్కో యుద్ధాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయని విమర్శించారు. ఈ చర్యల కారణంగా అమాయకపు ప్రజలు, పిల్లలు మరణిస్తుంటే.. మీరు ఎలా ఫీలవుతున్నారు..? అంటూ ప్రశ్నించారు. రష్యా చమురు కొనుగోలు ఫలితంగా భారత్ ఇప్పటికే మూల్యం చెల్లించుకుంటోందని వ్యాఖ్యానించారు. మాస్కోతో వ్యాపారం కొనసాగిస్తే ఇతర దేశాలకు కూడా త్వరలోనే ఇలాంటి పరిణామాలే ఎదురవుతాయని లిండ్సే గ్రాహం తీవ్రంగా హెచ్చరించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కీవ్‌పై రష్యా క్షిపణి దాడిలో 23 మంది ఉక్రెయిన్ వాసులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో లిండ్సే వ్యాఖ్యలు రావడం గమనార్హం.

# వివాదాస్పదమైన అగ్రనేత రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్ర

### –ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆయన తల్లిపై ఓ వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు
### –ఇందుకు గానూ మోదీకి రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని అమిత్ షా డిమాండ్

బీహార్ ఆగస్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర వివాదాస్పదమైంది. ఈ యాత్రలో ఓ వ్యక్తి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫైర్ అయ్యారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందుకు గానూ మోదీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'అనుచిత వ్యాఖ్యలకు గానూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లి, దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలి' అని షా డిమాండ్ చేశారు. 'మోదీ తల్లి చాలా పేద కుటుంబంలో తన జీవితాన్ని గడిపారు. తన పిల్లలను అత్యున్నత విలువలతో పెంచారు. అలాంటి మనిషిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. దీన్ని దేశ ప్రజలు ఎప్పటికీ సహించరు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ రాజకీయాలు అత్యంత దిగజారాయి. కాంగ్రెస్ పార్టీ దాని పాత స్వభావాన్ని, సంస్కృతిని తిరిగి తీసుకొచ్చింది. దేశ రాజకీయాల్లో విషం నింపుతోంది' అంటూ షా మండిపడ్డారు.

# హిమాలయ వెల్‌నెస్ 'వరల్డ్ ఆఫ్ నీమ్' ఆవిష్కరణ

### - నిజమైన చర్మ సౌందర్యం, ఇన్ఫ్లుయెన్సర్ వాయిస్, శతాబ్దాల నీమ్ శక్తి సమ్మేళనం




హైదరాబాద్, ఆగష్టు 29: హిమాలయ వెల్‌నెస్ గత ఇరవై ఐదు ఏళ్లుగా నీమ్ శక్తితో మొటిమలు, మొటిమలతో పోరాడుతున్న యువ భారతీయులకు నమ్మకమైన తోడుగా ఉంది. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ చర్మ సంరక్షణపై అవగాహన కల్పించేందుకు మొదటిసారిగా 'ది వరల్డ్ ఆఫ్ నీమ్' ఈవెంట్‌ను తాజ్ లాండ్స్ ఎండ్‌లో నిర్వహించింది. భారతదేశంలో సుమారు ఇరవై కోట్ల యువత మొటిమలతో బాధపడుతున్నారు. ప్రతి ఐదుగురులో నలుగురు యువతీ యువకులు మొటిమల కారణంగా ఆత్మవిశ్వాసం కోల్పోతున్నారని నివేదికలు చెబుతున్నాయి. ఈ సమస్యపై ఉన్న అపోహాలను తొలగించడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, మొటిమల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలపై అవగాహన కల్పించడం లక్ష్యం. ఈ కార్యక్రమం ఆధునిక యువత మనస్సులకు దగ్గర కావడానికి రూపకల్పన చేయబడింది. చర్మ సంరక్షణ ఎంత సులభం, సమర్థవంతం, సంపూర్ణమైనదో చూపించడమే కాకుండా మొటిమలు, మొటిమల సమస్యలపై ఉన్న దృక్పథాన్ని మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. చర్మ నిపుణులు, సినీ ప్రముఖులు, ఇన్ఫ్లుయెన్సర్లు, బ్రాండ్ ప్రతినిధులు కలసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు మొటిమలపై ఉన్న అపోహాలను తొలగించేందుకు ప్రయత్నం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొటిమలు, ఆత్మవిశ్వాసంపై ఇంటరాక్టివ్ ప్యానల్ చర్చ నిర్వహించారు. ఈ చర్చను ప్రముఖ డెర్మటాలజిస్ట్, కాస్మెటాలజిస్ట్, వైద్య నిపుణురాలు డాక్టర్ రష్మి శెట్టి నడిపించారు. ఆమె సాధారణంగా ఉన్న అపోహాలను నివృత్తి చేస్తూ, సంపూర్ణమైన చర్మ సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. 'లపటా లేడీస్' చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన సెలబ్రిటీ నితాన్షి గోయల్ తన వ్యక్తిగత చర్మ అనుభవాలను పంచుకున్నారు. 'పింపుల్స్ అనేవి ఎదుగుదలలో భాగం మాత్రమే, దాచుకోవాల్సినవి కావు' అని చెప్పారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. వీరిద్దరూ కలిసి యువ ప్రేక్షకులను తమ చర్మాన్ని గర్వంగా, పాజిటివ్‌గా స్వీకరించేందుకు ప్రేరేపించారు. హిమాలయ తన ప్రసిద్ధ నీమ్ ఫేస్‌వాష్ ను కూడా ఈ వేడుకలో ప్రదర్శించింది. ఇప్పుడు ఇది ప్రత్యేకమైన 5 పార్ట్స్ ఆఫ్ నీమ్ ఫార్ములేషన్‌తో కలదు. ఇది మొటిమల సమస్యను మరింత సమర్థవంతంగా నియంత్రించనుంది. ఈ కొత్త ఆవిష్కరణతో హిమాలయ మొటిమల సమస్యకు సొల్యూషన్‌గా ప్రకృతిసిద్ధమైన మృదువైన సంరక్షణతో భారతదేశ నెంబర్ వన్ ఫేస్‌వాష్ బ్రాండ్‌గా ఎందుకు కొనసాగుతోందో మళ్లీ రుజువు చేసింది. ఈ సందర్భంలో హిమాలయ వెల్‌నెస్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డివిజన్ బిజినెస్ డైరెక్టర్ రాజేష్ కృష్ణమూర్తి మాట్లాడుతూ హిమాలయ వెల్‌నెస్‌లో మేము నమ్మేది ఒక్కటేనన్నారు. అది చర్మ సంరక్షణ మృదువుగా, సమర్థవంతంగా ఉండాలన్నదేనన్నారు. గత 25 ఏళ్లుగా మా నీమ్ ఫేస్‌వాష్ రోజువారీ చర్మ సంరక్షణకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఇప్పుడు కొత్త 5 పార్ట్స్ నీమ్ ఫార్ములేషన్‌తో ఈ వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ముఖ్యంగా యువత తమ చర్మం పై ఆత్మవిశ్వాసంతో ఉండేందుకు శక్తినిస్తున్నామని తెలిపారు.

# కేంద్ర నిధులతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి

### –తిమ్మాపూర్ బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి



కరీంనగర్, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి) కేంద్రం ఇస్తున్న నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తిమ్మాపూర్ బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మహాత్మా నగర్ లోని ఒక ఫంక్షన్ హాల్ లో శుక్రవారం మండల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ గతంలో ఉన్నటువంటి బిఆర్ఎస్ ప్రభుత్వం ,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ లకు నిధులు కేటాయించలడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ లల్లో నిధులు లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ప్రజలకు ఉచిత రేషన్ బియ్యం, గ్రామాల్లో రోడ్ల నిర్మాణంతో పాటుగా ఇండ్ల నిర్మాణం లో కూడా నిధులు కేటాయించేది ప్రధాని నరేంద్ర మోదీ నేత్రుత్వం లోని కేంద్రప్రభుత్వమే నని తెలిపారు.తిమ్మాపూర్ మండలం లో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు.అధికార వ్యవస్థ నిర్వీర్యం అయిందని అన్నారు.రైతులకు యూరియా అందించడం లో ప్రభుత్వం విఫలమయిందని అన్నారు. ప్రొద్దంతా వరుసలో నిలబడ్డాగానీ ఒక్కరికి రెండు కంటే యూరియా అందివ్వలేనందుకు కాంగ్రెస్ నాయకులు సిగ్గుపడాలని ఆరోపించారు.పాఠశాల ల్లో సంఖ్య ను పెంచే ఉద్దేశ్యతో మండలంలోని 11 జడ్పి పాఠశాలల్లో ఎస్సీస్సి చదువుతున్న 678 మంది విద్యార్థిని, విద్యార్థులకు సైకిల్ లు అందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కు మండల శాఖ తరపున ధన్యవాదములు తెలిపారు. సెప్టెంబర్ 3 న కరీం నగర్ పార్లమెంట్ పరిధిలో జరిగే బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి తప్పనిసరిగా ఆపేక్షితులు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల ప్రభారీ నరహరి లక్ష్మారెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర,మాజీ ఎంపిటీసి ఎడ్ల జోగిరెడ్డి,రాష్ట్ర నాయకులు పుప్పాల రఘు,జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్,చింతం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,తమ్మనవేణి ఉపాధ్యక్షులు రాజు యాదవ్,కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్,ఓబీసీ మోర్చా జిల్లా ఈసీ మెంబర్ కొయ్యడ శ్రీనివాస్ గౌడ్,కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, వేల్పుల ఓదయ్య యాదవ్,పడాల శ్రీనివాస్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రామిడి మహేందర్ రెడ్డి,దుర్సెట్టి అజయ్, ప్రేంచంద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పూర్తిగా నీటమునిగిన ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయం

### -రాజగోపురంలో ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసిన భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తున్నఅధికారులు



ఏడుపాయల ఆగస్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయం పూర్తిగా నీటమునిగింది. మంజీరానది ఉధృతితో గర్భగుడి ముందు నుంచి రేకులను తాకుతూ వరద ప్రవహిస్తున్నది.

ఈ నేపథ్యంలో రాజగోపురంలో ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసిన అధికారులు.. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. ఆనకట్ట వైపు భక్తులు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.ఎగువన ఉన్న సింగూర్ జలాశయంలో నీటిమట్టం పెరగడంతో అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో మంజీరా నదిలో భారీగా వరద ప్రవాహం పెరిగి ఏడుపాయల ఆలయం చుట్టూ జలమయం అయింది. గత 15 రోజులుగా అమ్మవారి ఆలయం జలదిగ్బంధంలోనే ఉన్నది.

# ప్రభుత్వ పాఠశాలకి పనిముట్లు అందజేత




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న వేషాల అంజయ్య తోట పనుల నిమిత్తం ఒక గడ్డపార, రెండు తట్టలు రెండు చెక్క పారలు అందజేశారు. జరిగింది. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ రాజారత్నం, ఫిజికల్ డైరెక్టర్ హమీద్, మల్లేశం, కోటేశ్వర్, సతీష్, చంద్రమౌళి తదితరులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

కడ్తాల్, ఆగష్టు 29 : ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్వహించి ఆశా వర్కర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాన్ని రూ.18 వేలుగా నిర్ణయించి, ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు.

శనివారం నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలను నెరవేర్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో ఆశా వర్కర్ల తరుపున పెద్ద ఎత్తున్న ఉద్యమాలు చేపడతామన్నారు. అనంతరం ఆశా వర్కర్ల మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S. NO. 3159 of 2025**

Between.
1. K. Santosh Kumar S/o. Late Kaikalur Kamalakar.
2. K.Latha, D/o. Late Kaikalur Kamalakar
3. K. Hari Krishna, S/o. Late Kaikalur Kamalakar

...Plaintiffs

AND

1. Tahsildar, Himayath Nagar Mandal.
2. All Concerned.

...Defendants.

NOTICE

To
All Concerned.

This is inform to general public that the Plaintiffs have filed a suit for declaration to declare them as Legal Heir of deceased late Smt.K. Rama Devi, W/o. Late Sri Kalkaluru Kamalakar who died on 21-03-2025. As such general public are hereby informed you that if anybody having any objection kindly appear before the above Hon'ble Court on **10-09-2025** at 10.30 A.M. either in per son or through advocate. failing which matter will be decided as per law, Hence the notice.

(BY ORDER OF THE COURT)

**M/s.H. PRASHANTH RAJ**
ADVOCATE
Cell: 8712000030
Office: 3-3-232, Choppal Bazar, Kachiguda, Hyderabad-27

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com